# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

30 ఏళ్ల ప్రస్థానం 30 వార్త వార్షికోత్సవం 1996 - 2026


## తిరుపతి అదనపు ఎస్పీ వెంకటరావు బదలీ

### -సిఐడి ఏఎస్పీగా పద్మలతకు అదే స్థానం





తిరుపతి,జూన్ 5(ప్రభాతవార్త: తిరుపతి అదనపు ఎస్పీ జె,వెంకటరావు బదలీ అయ్యారు. ఆయన నాలుగు సంవత్స రాలుపైగా తిరుపతిలో ఒకేచోట పనిచేయ డంతో ఆయనను ప్రభుత్వం బదలీ చేసింది. ఇంటెలిజెన్స్ విభాగంలో ఆయ నకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాగా తిరుపతిలో సిఐడి డిఎస్పీగా ఉన్న పద్మలతకు ఏఎస్పీగా పదోన్నతితో బాటు పోస్టింగ్ కూడా ఇక్కడే ఇవ్వడంతో ఆమె అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా పోలీస్‌శాఖ ఈగల్ విభాగంలో డిఎస్పీగా ఉన్న జెస్సీ ప్రశాంతికి అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించి అదే స్థానంలో పోస్టింగ్ ఇచ్చారు. వీరంతా ఉత్తర్వులు అందిన వెంటనే కొత్త స్థానాల్లో చేరాలని పేర్కొన్నారు.

## ఒక్క ఎకరాకు 45 లక్షలు ఇవ్వండి

వాకాడు, జూన్ 5 ప్రభాతవార్త: మండలంలోని దుగరాజపట్నం లో నౌకా కేంద్రం పోర్టుకు స్వాగతిస్తున్నామని, ఆ పరిసర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలందరం భూములు ఇచ్చి సర్వం కోల్పోతున్నామని ఒక ఎకరాకు 45 లక్షల రూపాయలు ఇవ్వాల్సిందేనని అధికారు లను కోరారు, శుక్రవారం మండల కేంద్రమైన వాకాడు తహసిల్దార్ కార్యాలయంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి సమక్షంలో కోర్టు భూభాగంలో గ్రామాల ప్రజలతో సమావేశం జరిగింది, స్థానిక నేతలు టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకట రమణయ్య ఐదు గ్రామాల రైతులతో కలిసి ఆ ప్రాంతంలో ఎన్నో ఏళ్లగా భూమిని నమ్ముకుని బ్రతుకుతున్నామని, భూములు ఇచ్చి సర్వం కోల్పోతున్నామని ప్రభుత్వం స్పందించి ఒక ఎకరాకు నలభైదు లక్షల రూపాయల చొప్పున ఇవ్వాలని ప్రకటించారు, జాయింట్ కలెక్టర్ స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, మరోసారి కూడా కలెక్టర్‌తో రైతులు సమావేశం ఉంటుందని తెలియజేశారు. తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, డిప్యూటీ తాసిల్దార్ మహమ్మద్ రఫీ, అఖిల్ యాదవ్, వీఆర్వోలు, కొడవలూరు దామోదర్ రెడ్డి, ఆర్కేట్ మహేంద్ర, అయోధ్య బాలచంద్ర శెట్టితదితరులు ఉన్నారు.

## ప్రయాణీకుల భద్రత కోసం...

# ప్రతి ఆటోకు గుర్తింపు సంఖ్య

-సురక్షిత రవాణా వ్యవస్థ నిర్మాణంలో ఆటోడ్రైవర్లు భాగస్వామ్యం
-త్రిచక్ర వాహన ప్రయాణాలు' కార్యక్రమంకు ఎస్పీ శ్రీకారం




చిత్తూరు, జూన్ 5 ప్రభాతవార్త: ప్రయాణీ కులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడం కోసం పోలీసుశాఖ జన విశ్వాస్-సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణం కార్యక్రమంకు శ్రీకారం చుట్టిం దని ఈ కార్యక్రమంలో ప్రతి ఆటోకు పోలీసు శాఖ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇస్తోందని ఎస్పీ తుషార్ డూడి పేర్కొ న్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం పలమ నేరులో జన విశ్వాస్-సురక్షిత త్రిచక్ర ప్రయాణాలు' కార్యక్రమంను ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ తుషార్ డూడి ఆటోరిక్షాలకు ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్య(యూనిక్ పోలీస్ ఐడెంటిఫికేషన్ నెంబర్), ప్రత్యేక క్యూఆర్ కోడ్ కల్గిన స్టిక్కర్లను ఆటోలకు అతికించి కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నివారణ, ప్రజలకు సురక్షితమైన వ్యవస్థను అందించడానికి జిల్లా పోలీసులు నిరంతరం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను పెంపొందిస్తూ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ప్రజల్లో భద్రతాభావం, పోలీసు శాఖపై విశ్వాసంను మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా పోలీసు శాఖ మరో ముందడుగు వేస్తోందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత ఆటో, డ్రైవర్, యాజమాని, వాహనానికి సంబంధించిన అధికారిక వివరాలు, ఇతర అవసరమైన సమాచారం సత్వరం అధికారులకు అందుబాటులోకి వచ్చే విధంగా వ్యవస్థను రూపొందించడం జరిగిందన్నారు. ప్రజలు ప్రతిరోజు ఉపయోగించే ఆటోరిక్షా ప్రయాణం మరింత సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడానికి ఈ కార్యక్రమంను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి ఆటోను ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ పరిధిలోకి తీసుకువచ్చి అవసరమైనపుడు సంబంధిత వివరాలను తక్షణం గుర్తించే విధంగా సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రజలకు మర్యాదగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అధిక వేగంతో వాహనాలను నడుపరాదని ఎస్పీ సూచించారు. అలాగే మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా వుందని, డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అరననాధరెడ్డి, ఎఎస్పీ తరుణ్ పహ్వా, పలమనేరు డిఎస్పీ, పలమనేరు అర్బన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌రెడ్డి, పలమనేరు రూరల్ ఇన్స్‌పెక్టర్ పరశురాముడు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్, పలమనేరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు, ఆటో యూనియన్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.









## అమ్మడానికి కాదేదీ ...అమ్మకానికి అనర్హం!

### -దేవస్థానం దుకాణం ప్రక్కనే అనధికార విక్రయాలు

శ్రీకాళహస్తి,జూన్ 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లోఏ దైనా అమ్ముకోవచ్చుననే వాతావరణం చోటు చేసుకుంది. అధికారులు పట్టించుకోరు. ధర్మకర్తల మండలి నియమించినా తిరిగి చూడరు. భక్తుల బాధలు పట్టవు. దళారుల దందా పెరిగిపోయినా కనబడదు. భక్తులు శ్రీకాళహస్తిలో కాలుమోపి నప్పటి నుంచి రక రకాలుగా దోపిడి. బస్సుదిగిన వెంటనే దుకాణం దారులు, దాటితే చెప్పులు భద్రపరచువారు. మరో అడుగు దాటితే పసుపు దారాలు, పత్రి అంటూ కొందరు దోచుకుంటున్నారు. ఇక దేవస్థానం అగరబత్తీల విక్రయాలంటూ ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద కొత్తగా వెండి కడియాల విక్రయాలకు తెర తీసారు. ఇక్కడ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా సన్నగిల్లింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్ధలతో వస్తున్న భక్తులు అడుగడుగునా దోపిడికి గురౌతున్నారు. అయితే పట్టించుకునే దిక్కులేదు. ఇక్కడ జరుగుతున్న నిలువుదోపిడికి సంబంధించి ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఓ వైపు దోపిడికి గురౌతున్న వారు ఆన్‌లైన్ పుణ్యమా అని రాహుకాలంలో పూజలు కూడా చేయించుకోలేక పోతున్నారు. దాంతో నిరాశ నిస్పృహలతో పూజలు చేయించు కోకుండానే వెనుదిరుగుతున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అడుగు పెట్టినప్పటి నుంచి సాగుతున్న దోపిడితో భక్తులు' ఎందుకొచ్చామబ్బా' అంటూ మానసిక వేదనతో వెనుదిరుగుతున్నారు.

**కొత్త వ్యాపారానికి తెర:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రస్తుతం కొత్త వ్యాపారం ట్రెండ్ చోటు చేసుకుంది. దేవాదాయశాఖ నాలుగు గోపురాల వద్ద అగరబత్తీల షాపులకు అనుమ తించింది. అయితే ఆ షాపుల్లో అగర్‌బత్తీలే కాదు రకరకాల వస్తువులు విక్రయించుకుంటున్నారు. కానీ పట్టించుకునే దిక్కులేదు. దక్షిణ గోపురం




వెండి కడియాల వ్యాపారం సాగిస్తున్న దృశ్యం

ఎదురుగా ఉన్న స్థుపద మండపం పక్కనే ఓ టేబుల్‌వేసి వెండి కడియాల వ్యాపారం ప్రారంభించారు. ఇన్ని జరుగుతున్నా ఆలయంలో నిత్యం పర్యవేక్షించే అధికారి కళ్ళకు కనబడదు. ఇక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటి భక్తుల మీద తమ ప్రతాపం చూపిస్తారు. కానీ దారికి అడ్డంగా టేబుల్‌వేసి వ్యాపారం చేసుకునే వారిని గురించి పట్టించుకోరు. ఇవి భక్తులకు ఎందుకు ఉపయోగపడతాయో చెప్పరు. ఎవరికి వారు తమ జీవనోపాధి అంటూ వచ్చిన భక్తులను దోచుకుంటుంటే పట్టించుకునే దిక్కులేదు. ఆ ముక్కంటీశుడే భక్తుల మనోభావాలను కాపాడుకునే దుస్థితి చోటు చేసుకుంది.












## ప్రకృతి పరిరక్షణ సామాజిక బాధ్యత : కలెక్టర్



గుడిపాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

గుడిపాల, జూన్ 5 ప్రభాతవార్త: సమాజంలోని ప్రతి ఒక్కరు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. గుడిపాల మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను పెంచి పచ్చదనంను పంచే కార్యక్రమంను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా కాకుండా వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని పిలుపు నిచ్చారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యరకమాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛంధంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలన్నారు. అలాగే ప్రకృతి తల్లి లాంటిదని, ప్రకృతికి ప్రాణాధారమైన చెట్లు ప్రాణికోటికి ప్రాణాధారమని పేర్కొన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరు తమ చుట్టూ వున్న పరిసరాలను పచ్చదనంతో నింపాలన్నారు. సామాజిక అడవుల పెంపకం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో ప్రజలకు ఓ వైపు ఉపాధి కల్పిస్తూనే మరోవైపు పచ్చదనం పెంచడం జరుగుతుందన్నారు. మొక్కలను వ్యక్తిగతంగా అభిమానిస్తూ మన ఇంటి పరిసరాల్లో మనకు చెరువలో పచ్చదనంను పెంచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టితో పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వం ధ్యేయంగా మలుచుకుంటూ రాష్ట్ర అభివృద్ధిని హరిత దిశలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, ఈస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పట్టాభి, వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ థామస్‌సుకుమార్, రేంజ్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి, చిత్తూరు సోషల్ ఫారెస్ట్ డివిజన్ అధికారి సి.కరణ్‌సింగ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.హరిబాబు, ఎంపిపి హరిప్రసాద్ చౌదరి, ఎంపిడిఓ శిరీష, మండల దేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.











## యోగాభ్యాసంతో మానసిక ప్రశాంతత



తిరుమల,జూన్ 5(ప్రభాతవార్తప్రతినిధి: మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, ఆరోగ్యకర జీవనశైలికి యోగాభ్యాసం ఎంతో ఉపయుక్తమని టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర అన్నారు. జూన్ 21న అంతర్జా తీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిం చనున్న కార్యక్రమాలపై శుక్రవారం సాయంత్రం తిరుమల పద్మావతి అతిథి భవనంలోని సుదర్మ సమావేశ మందిరంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇతర అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. జూన్ 7 నుండి 21వ తేదీ వరకు ప్రతిరోజూ టిటిడి ఆధ్వర్యంలో యోగా అవగాహన, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యోగాభ్యాసం ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. అన్ని వయస్సుల వారిలో ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చేందుకు యోగా ఉత్తమ సాధనమని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈషా ఫౌండేషన్, పతంజలి యోగపీఠం, రామచంద్ర మిషన్, బ్రహ్మకుమారీస్, టిటిడి ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జూన్ 7 నుండి 21 వరకు టిటిడి ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, ఆసుపత్రుల్లోని రోగులకు ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యోగా దినోత్సవానికే పరిమితం కాకుండా ఈ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే యోగాపై ఆసక్తి, అవగాహన పెంపొందేలా విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూన్ 21న ఉదయం 6 గంటలకు తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమం అనంతరం వేలాది మంది పాల్గొనే యోగా అవగాహన ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, జెఈఓ (విద్య, ఆరోగ్యం) డాక్టర్ శరత్, సీవీఎస్ఓ కెవి మురళీకృష్ణ, సీఇ సత్యనారాయణ, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, డీఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈఓ ఆనందరాజు,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, తదితర అధికారులు పాల్గొన్నారు.




# డిఎస్సీ నియామకంపై వైకాపా అనవసర రాద్ధాంతం

– బిసి సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం

చిత్తూరురూరల్, జూన్ 5 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రక్షాళన, అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన డిఎస్సీ నియామకాల పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని బిసి సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పి. షణ్ముగం దుయ్యబట్టారు. శుక్రవారం మున్సిపల్ కాంప్లెక్స్ నందుగల బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ముందుగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తి కావడంతో చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్‌మోహన్‌లకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎంతోకాలంగా నిరుద్యోగులు ఎదురు చూస్తుంటే అర్హత పరీక్షలు పూర్తయి నియమక ప్రక్రియ సాగుతున్న సమయంలో వైకాపా కావాలనే రాద్ధాంతం చేసి యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 16వేల మంది ఉపాధ్యాయుల ప్రతిష్ట, భవిష్యత్తును వైకాపా రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. వైకాపా అధికారంలోని వచ్చిన వెంటనే డిఎస్సీ నియామకాలు రద్దు చేస్తానని చెప్పడం వినడానికి విడ్డూరంగా వఉందన్నారు. టీచర్లుగా నియమింపబడ్డ వారిలో 50శాతం వెనుకబడిన వర్గాలకు చెందిన వారే వున్నారనీ, కష్టపడి ఉద్యోగం సంపాదించుకొన్న వారికి మనశ్శాంతి లేకుండా రాద్ధాంతం చేస్తున్న వైకాపా తీరును తీవ్రంగా ఖండించారు. ఇకనైనా వైసిపి అనవసర రాద్ధాంతాలు మానుకోకపోతే బిసి సంక్షేమ సంఘ ఉద్యమిస్తుందని తీవ్రంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు రవీంద్రరాజు, కార్యదర్శులు కుసుమ రుద్రయ్య, జిల్లా మహిళా కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

### ఘనంగా రవీంద్రరాజు జన్మదిన వేడుకలు

చిత్తూరురూరల్, జూన్ 5 ప్రభాతవార్త:



జాతీయ బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా వడ్డెరసంఘ అధ్యక్షులు రవీంద్రరాజు జన్మదిన వేడుకలను శుక్రవారం బిసి సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో ముందుగా రవీంద్రరాజును దుశ్శాలువతో సత్కరించి ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

### బుల్లెట్ ట్రైన్ స్టాపింగ్ ఇవ్వాల్సిందే...

మంత్రికి పరిరక్షణ సమితి వినతి

పలమనేరు, జూన్ 5 ప్రభాతవార్త:



పలమనేరులో బుల్లెట్ ట్రైన్ ఆపాల్సిందే నని (పిపిఎస్) పలమనేరు పరిరక్షణ సమితినాయకులు విన్నవించారు. శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య ఆరోగ్య శాఖ మంత్రి వై, సత్యకుమార్‌ను ధర్మవరంలో కలిశారు. బెంగళూరు, మైసూర్ నుండివచ్చే బుల్లెట్ ట్రైన్ పలమనేరులో ఆపాలని వినతిపత్రం అందజేశారు. బిజిపి రాష్ట్ర నాయకులు స్వావలంబి,భారత్ అభయాన్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్ ఈ కీలక సమావేశం ఏర్పాటు చేశారు. పలమనేరు ప్రజల ఆకాంక్షను, ఈ ప్రాంత అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ అవసరం గురించి వివరించారు. ఇది కేవలం మాడిమాండ్ కాదు మా హక్కు అని తెల్చిచెప్పారు. సానుకూలంగా స్పందించిన మంత్ర సత్యకుమార్ ఈ విషయం రైల్వేశాఖ మంత్రి దృష్టికి తెస్తానని హామీ ఇచ్చారు. నాయకులు టిఎల్ నరసింహులు, నారాయణ, పొన్నుడి, రామచంద్ర, వీరభద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంరక్షణే ధ్యేయం : జిల్లా ఎస్పీ

పలమనేరు, జూన్ 5 ప్రభాతవార్త:




ధైర్యే సాహసేలక్ష్మి అంటూ ముందుకు సాగాలని, ప్రజా సంరక్షణే పోలీస్‌శాఖ ధ్యేయమని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజల సంరక్షణ కోసం పోలీస్ శాఖ వివిధ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రజల మాన ప్రాణాలు కాపాడడం, చోరీలు అరికట్టడం, ప్రమాదాలు నివారించడం, యువతను మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా సక్రమమైన మార్గంలో నడిపించడం వంటి కార్యక్రమాలతో ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు వివరించారు. ఇక ఇళ్ళ వద్ద ముసలి తనంతో ఉండే అవ్వా తాతల సంక్షేమం కూడా పోలీస్ శాఖ నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు అల్లుళ్ళు ఉద్యోగాలు చేస్తూ తల్లిదండ్రులను విస్మరించడం భ్యావం కాదన్నారు. అవసాన దశలో పెద్దల బాగోగులు పట్టించుకోక పోతే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని కౌన్సిలింగ్ ఇచ్చి నచ్చజెపుతామని వివరించారు. ప్రజల సహకారంతో తమ కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. డిఎస్పీ దేగల ప్రభాకర్, సిఐ మోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

రామకుప్పం, జూన్ 5 ప్రభాతవార్త :



సమాజంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల అధ్యక్ష ,మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఎంపీపీ గుర్రప్ప పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చెట్ల పెంపకంతో పర్యావరణం పెంపొంది మంచి ఆరోగ్యం లభిస్తుంది. ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ గణేష్, ప్రిన్సిపాల్ రజనీ కుమార్ నేతలు సీతాపతి, రవిరెడ్డి, రఘు, బాలరాజు, మురళి,రాజసింహ, జనార్దన్ రెడ్డి, ఆంజనేయప్ప, నాగరాజు, హరి, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

### ఘన వ్యర్థాల నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ

చిత్తూరు, జూన్ 5 ప్రభాతవార్త:

ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకుని ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపుకు మొక్కలు నాటే కార్యక్రమంను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ ఘన వ్యర్థాల నిర్వహణ చట్టం–2026, వ్యర్థాలను నాలుగు భాగాలుగా విడదీయడంపై అవగాహన కల్పించారు. సాధారణంగా ఉత్పత్తి అయ్యే వర్థ్యాలను తడి, పొడి వ్యర్థాలతో పాటుగా శానిటరీ వ్యర్థాలు, స్పెషల్ కేర్ వేస్ట్ వ్యర్థాలను వేరు చేయడం, ఘన వ్యర్థాల నిర్వహణ చట్టం–2026, నిబంధనలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పలమనేరు, జూన్ 5 ప్రభాతవార్త:



ప్రపంచ పర్యావరణ దినోత్సవం పలమనేరులో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఎన్‌జిఓ భవన ంనుండి ఎంబిటి రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. పలమనేరు ప్రకృతి సంరక్షణ, పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఎన్‌జిఓ హోమ్ అవరణలో విరివిగా మొక్కలు నాటారు. నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, చేతి సంచుల వాడకం, భూగర్భజలాల పెంపు, పెట్రో ఉత్పత్తుల వినియోగం తగ్గింపు, సంప్రదాయ వనరుల వినియోగం తదితర అంశాలపై అవాగాణ కల్పించారు. ప్రజలు త మదైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే పర్యావరరణ పరిరక్షణతో పాటు సమతుల్యం సాధించవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ కనసీం ఒక మొక్క అయినా నాటి సంరక్షించాలని కోరారు. మున్సిపల్ కమీషనర్, కెవి రమణారెడ్డి,ఆనంద్‌బాబు, విజయకుమార్‌రెడ్డి. శ్రీపురం సీతా రామయ్య, వియజకుమార్, జగన్నాథం, శేఖర్, నాగప్ప, సోమసుందరంరెడ్డి, మురళి, సన్నీరాజ, నిసార్, ఇంతియాజ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

### టీచర్ల కోసం ప్రత్యేక టెట్

– రాష్ట్ర వైఎస్‌ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరుహెల్త్, జూన్ 5 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించాలని రాష్ట్ర వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ టెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించడం కష్టసాధ్యంగా వుంటుందని ఆందోళన చెందుతున్నారని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల్లో టెట్ భయంను తగ్గించే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ఉపాద్యాయుల ప్రయోజనాల కోసం ప్రతి ఏడాది రెండు పర్యాయాలు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షను ఒకే రోజు ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించాలన్నారు. అలాగే ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే టెట్ సిలబస్‌లో గల ఇబ్బందులను తొలగించి సబ్జెక్టు నైపుణ్యంకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అందిరికీ సమాఏనంగా మార్కులను 45 శాతంకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

### మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి

రామకుప్పం,జూన్ 5 ప్రభాతవార్త:



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంపిపి సులోచన గుర్రప్ప కోరారు. శుక్రవారం స్థానిక బాలికల పాఠశాలలో డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యతతో ఆహారం అందించాలన్నారు. వంట గదుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వంటల నిర్వహకులకు వంటల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి జడ్పీ హైస్కూల్ ముద్దనపల్లి, రెండవ బహుమతి జడ్పీ హైస్కూల్ అనిగానూరు, మూడవ బహుమతి చిన్నబల్దారు పాఠశాలల వంట నిర్వాహకులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు మల్లి కార్జున, నారాయణ, రాజేంద్ర, నేతలు బాలరాజు, సురేష్, సీఆర్పీలు, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్ నిజాయతీ

–బంగారు నగలు పోలీసులకు అప్పగింత

పలమనేరు, జూన్ 5 ప్రభాతవార్త:

ఆటోలో ఓ మహిళ ఏమరుపాటుగా వదలి వెళ్ళిన బంగారునగలు అటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి తన నిజాయతీని చాటుకున్నాడు. పలమనేరు పట్టణంలోని బోయవీధికి చెందిన ఆటో డ్రైవర్ చాంద్‌బాషా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఓ మహిళ అటోలో వస్తూ ఏమరుపాటుగా బంగారునగలు ఆటోలో వదలి వెళ్ళి పోయింది. కొంతసేపటికి ఈ విషయం తెలుసుకున్న ఆటో డ్రైవర్ బంగారునగల పర్స్‌ను పోలీసులకు అప్పగించాడు, విషయంతెలుసుకున్న జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ శుక్రవారం పలమనేరుకు విచ్చేయడంతో పోలీసులు పర్స్‌ను ఎస్పీకి అందజేశారు. ఎస్పీ ఆటో డ్రైవర్ చాంద్‌బాషాను పిలిపించి పర్స్‌ను బాధితురాలికి అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని ఎస్పీ అభినందించారు.

### ఇన్‌చార్జ్ తహసిల్దార్ కౌలేష్‌కు పదోన్నతి

రామకుప్పం, జూన్ 5 ప్రభాతవార్త:

రామకుప్పం ఇన్‌చార్జ్ తహసిల్దార్ కౌలేష్‌కు పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ కౌలేష్‌ను అధికారులు, సిబ్బంది పూలమాలలు, దుశ్యాలువ వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### వైకాపా ఆటలు సాగవు

– మండల దేశం కన్వీనర్ రుద్రయ్యానాయుడు

పెనుమూరు, జూన్ 5 ప్రభాతవార్త:

రాష్ట్రంను ప్రగతి పథంలో నడిపిస్తూ ప్రజలు కోరుకుంటున్న కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్న వైకాపాను ప్రజలు చీధరించుకుంటున్నారని మండల తెలుగుదేశం కన్వీనర్, మాజీ జట్పీటిసీ పెద్దినేని రుద్రయ్యానాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ళలో తల్లికి వందనం పథకం కింద ఒకొక్క బిడ్డకు రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ కింద ఒకొక్క రైతుకు రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ లాంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. అలాగే మెగా డిఎస్సీ, జాబ్ క్యాలెండర్‌తో పాటు దాదాపు ఏడు లక్షల ఉద్యోగాలు, వృద్ధ్యాప్య పెన్షన్లు ఒకే దఫా రూ.4 వేలకు పెంచిందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు ఆహారంను అందిస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా చేసుకుని రాష్ట్రంను ముందుకు తీసుకెళ్ళడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేని వైకాపా నాయకుల ప్రజలను తప్పు తోవ పట్టించడానికి కులాల మధ్య విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

### కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం

పలమనేరు, జూన్ 5 ప్రభాతవార్త:



పలమనేరు కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం శుక్రవా రం ఘనంగా జరుపుకున్నారు. కోర్టు ఆవరణలో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు నాటా రు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి వావిలి ఆదినారాయణ మాట్లాడుతూ చెట్లను సంరక్షి ద్దాం, పర్యావరణం కాపాడు దామంటూ ఉద్బోధించారు. చెట్లు నాటడం వల్ల పర్యావరణం పరిరక్షించు కోవచ్చని కాలుష్యం నివారించవచ్చని సూచించారు. ఇది భావితరాలకు మనం అందించ వలసిన వారసత్వ సంపద అని కొనియాడారు. ప్రకృతిపై మనకు ఎంత హక్కు ఉందో పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా అంతే వుందని వివరించారు. జూనియర్ సివిల్ లిఖిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్షాద్, ఉపాధ్యక్షుడు లోకేష్, జగదీష్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు పరమశివప్ప, లక్ష్మీపతి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, రెడ్డెప్ప, రాజారెడ్డి, ఆరీఫుల్లాఖాన్, మహేశ్వరి, అటవీశాఖ సిబ్బంది హైమావతి తదితరులు పాల్గొన్నారు.

### లడ్డు పోటులో ఛైర్మన్, ఈఓల ఆకస్మిక తనిఖీలు

కాణిపాకం, జూన్ 5 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం లడ్డుపోటులో శుక్రవారం ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా వారు లడ్డు తయారీ విధానాన్ని పరిశీలించారు.లడ్డు తయారీలో భాగంగా బూందీ తయారీ విధానాన్ని పరిశీలించారు. అలాగే లడ్డు తయారీలో దిట్టం గురించి అడిగి తెలుసుకున్నారు.అలాగే నాణ్యమైన, రుచికరమైన లడ్డూ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు అందించాలి సూచించారు. ఈకార్యక్రమంలో పోటు ఇన్‌చార్జి సంతానం తదితరులు పాల్గొన్నారు.

### తహసిల్దారుగా లోకేశ్వరీ బాధ్యతలు స్వీకరణ

పెనుమూరు, జూన్ 5 ప్రభావార్త:



పెనుమూరు మండల తహసిల్దారుగా లోకేశ్వరీ శుక్రవారం తహసిల్దారు కార్యాలయంలోని తహసిల్దారు ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్‌కుమార్ రేణిగుంట తహసిల్దారుగా బదిలీపై వెళ్ళడంతో ఐరాల మండల తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న లోకేశ్వరీని కలెక్టర్ సుమిత్‌కుమార్ పెనుమూరు మండల తహసిల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు తహసిల్దారు లోకేశ్వరీ శుక్రవారం తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### ఐరాల తహశీల్దార్‌గా రామకృష్ణ బాధ్యతలు స్వీకరణ

ఐరాల, జూన్ 5 ప్రభాతవార్త:



ఐరాల మండల తహశీల్దార్‌గా రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఐరాల మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న లోకేశ్వరిని పెనుమూరు మండలంకు బదిలీ చేస్తూ తిరుపతి కలెక్టోరేట్‌లోని సివిల్ సప్లై శాఖలో డిటీగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను పదోన్నతి కల్పిస్తూ ఐరాల తహశీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆయన శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## రీ-సర్వే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

గుడిపాల, జూన్ 5 ప్రభాతవార్త:



రెవెన్యూ, రీ–సర్వే సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ప్రజా సమస్యలను శీఘ్రంగా పరిష్కరించడం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నూతన కార్యక్రమం 'ఒకనెల–ఒక నియోజకవర్గం–నాలుగు పర్యటనలు' కార్యక్రమంకు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం గుడిపాల మండలం నుండి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గుడిపాల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమంకు సంబంధించి జిల్లా స్థాయి సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్, డిఎఫ్ఓ సుబ్బరాజు, ఆర్డీఓ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యుటేషన్లు, జాయింట్ ఎల్‌పిఎం, సర్వే కరెక్షన్లు, మాప్ లైన్ కరెక్షన్లు, దారి వివాదాలు వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో వున్న సమస్యలను గుర్తించి, అవసరమైతే క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి ప్రజలకు సరైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. అలాగే రీ–సర్వేకు సంబంధించిన ఫిర్యాదులు కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ కొనసాగుతున్నాయని, అధికారులు వ్యవస్థబద్ధంగా దృష్టి సారించి రెండు నెలల్లో వాటిని పరిష్కరించడానికి పక్కాగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపిపి హరిప్రసాద్ చౌదరి, తహసిల్దారు శ్రీనివాసులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కాణిపాకం, జూన్ 5 ప్రభాతవార్త:

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి



బాధ్యత అని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు అన్నారు. కాణిపాకం దేవస్థానంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమంను నిర్వహించారు.ఈమేరకు దేవస్థానం వినాయకసదన్, కాణిపాకం–అగరంపల్లె 100 అడుగుల రోడ్లు కిరుపక్కల, దేవస్థానం ప్రాంగణంలో వున్న ఖాళీ ప్రదేశంలో వారు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంతో దేవస్థానం సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు అరవింద్, శివాంజనేయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశంలోనే కుప్పాన్ని...ఆదర్శం చేస్తున్న సిఎం

## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త:



కుప్పం నియోజకవర్గాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా చేస్తున్నారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం బస్టాండులో కడ అధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్స వం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కుప్పంలో 132ఇ -ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతోందన్నారు. దీనికితోడు పర్యావరణ పరిరక్షణకై కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు, చెత్త స ంపద తయారీ కేంద్రాలను ఏర్పాటుచేయిస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా డంపింగ్ యార్డులు లేకుండా చర్యలు చేపట్టారన్నారు. ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు కూడా పరిసరాల శుభ్రత, ప్రకృతి పరిరక్షణ తమ బాధ్యతగా భావించాలన్నారు. కుప్పం పట్టణంలో జూన్ నెలాఖరు కల్లా మూడో రీచ్ రోడ్డు విస్తరణ పనులు మొదలవుతాయన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు స్థలంలో 75 కోట్లతో ఆధునాతన కాంప్లెక్స్, మల్టీప్లెక్స్‌లు రానున్నాయన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ జనవరి నెలలో 5555 ఇ- సైకిళ్ల పంపిణీతో కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు గిన్నిస్ రికార్డుల నెలకొల్పార న్నారన్నారు. ప్రస్తుతం ఇ-సైకిళ్లను అదే ధరతో రాయితీతో అందిస్తున్నారని లక్కీడ్రా సైతం నిర్వహించి పదిమందికి ఉచితంగా ఇ-సైకిళ్ల అందించడం జరుగుతుందన్నారు. కుప్పంలో అభివృద్ధిలో సమూల మార్పులు వస్తాయన్నారు. అనంతరం పలువురికి ఇ -సైకిళ్ల, మహిళలకు ఉచితంగా క్లాత్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, కమీషనర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్, కాణిపాకం బోర్డు సభ్యుడు నరేష్, మాజీ సర ్పంచులు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్‌ఆర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాల సేకరణకు ఆధునాతన గాబ్లర్ లిట్టర్ వాహనం

కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త :



కుప్పం మున్సిపాలిటీలో రోడ్లను శుభ్రంచేసేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఆధునాతన గాబ్లర్ లిట్టర్ మెషిన్‌ను తెప్పించారు. ఈవాహనంను ప్రభుత్వవిప్, కడ పిఏసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ లాంఛనంగా ప్రారంభించారు. ఇరవై లక్షల దాకా విలువ చేసే ఈవాహనం రోడ్లపై పడిఉన్న చెత్త చెదారాలను గ్రహించి సేకరిస్తుందని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో ఈ యంత్రాన్ని వినియోగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, కమీషనర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్, గాబ్లర్ మెషిన్ తయారీ సంస్థ సిఇఒ శ్రీమతి సుధ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో ఇ - సైకిళ్లతో భారీ ర్యాలీ

కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త :



ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరించుకుని కుప్పం పట్టణంలో పెద్ద ఎత్తున ఇ-సైకిళ్ల ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వవిప్, కడ పిఏసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర క్మన్ సెల్వరాజ్, మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, కమీషనర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రాజే ంద్ర ప్రసాద్, కాణిపాకం బోర్డు సభ్యుడు నరేష్, మాజీ సర్పంచులు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్ తదితరులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక కడ కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ బైపాస్ రోడ్డు మీదుగా విజలాపురం సర్కిల్ వరకు ఆపై బస్టాండు దాకా కొనసాగింది. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు స్ఫూర్తితో కుప్పంలో ఇ-సైకిళ్ల ర్యాలీని చేపట్టామన్నారు. కుప్పంలో తొలిసారి ఇ-సైకిల్ తొక్కిన సిఎం చంద్రబాబు శుక్రవారం వైజాగ్‌లో సైతం ఇ-సైకిల్ ద్వారా ప్రయాణించడం ఆనందంగా ఉందన్నారు.

## మొక్కలునాటి పర్యావరణాన్ని రక్షించాలి

### - బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్

కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త:




ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాల్సిన అవసరం ఉందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో పర్యావరణ దినోత్స వం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ చెట్లను విపరీతంగా నరికేయడంతో పర్యావరణ హాని కలుగుతోందన్నారు. తద్వారా వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏడాది పొడవునా పచ్చదనం పెంపుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కోదండరామయ్య, హెచ్‌ఓడిలు డాక్టర్ శరవణ, మాధవన్, గంగాధరన్, డాక్టర్ అరుణ్‌కుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పసుపుసాగు రైతులకు లాభదాయకం

కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త:



పసుపు పంట సాగు రైతులకు ఎంతో లాభదాయకమని ఉద్యానశాఖ ఎడి పల్లవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్లమడుగులో రైతులకు పసుపు పంట సాగుపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఫామ్ అమినో అగ్రిటెక్ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ తమ సంస్థ కుప్పం ప్రాంతంలో రైతులకు పసుపు సాగుపై సలహాలు, శిక్షణ ఇవ్వడంతో పాటు పంటను సైతం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు డింపు ప్రియ, వింధ్య, మాజీ సర ్పంచ్ రాజేంద్రన్, రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : సిఐ



**శాంతిపురం, జూన్ 5 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండు వద్ద గ్రేస్ మారియా చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమంను సిఐ ప్రారంభించారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల ప్రభావం తగ్గించేందుకు మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చెట్ల పెంపకంను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్, గుడుపల్లె ఎస్సై శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలు జనార్ధనరెడ్డి, కుమార్, జయచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ చాముండేశ్వరి ఆలయ కుంబాభిషేకం

**కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త:** మండలంలోని పొన్నాంగూరులో నెలకొన్న శ్రీ ప్రసన్న చాముండేశ్వరి అమ్మవారు, శ్రీ మారెమ్మ ఆలయాల మహాకుంబాభిషేక కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వివాదం విషయంగా ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో కుంబాభిషేకంను ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత,మహిళలు అధిక సంఖ్యలో హాజరయా ్యరు.

## అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

**పెనగలూరు,జూన్ 5 ప్రభాతవార్త:** రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో నేడు



అంతర్జాతీయ పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరిం చు కొని పెనగలూరు మండలం సిం గారెడ్డి పల్లి గ్రామపం చాయతీ నందు కస్తూర్బా బాలికల స్కూల్ నందు అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని అనంత అరణ్య పద్ధతిలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు అలాగే స్కూలు ప్రిన్సిపాల్ సుచరిత మరియు అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసరు మరియు ఉపాధి సిబ్బంది మరియు స్కూల్ సిబ్బంది మొక్కలు నాటేందుకు గుంతలు తీసే కార్యక్రమానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 25. సెంట్లు విస్తీర్ణంలో ప్లాంటేషన్ చేపట్టనున్నారు పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం మరియు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మరియు పాఠశాలలో 12వ తేదీన సందర్భంగా కేజీబీవీ పాఠశాలలో స్టోర్ రూమ్ తరగతి గదులు మరియు వంటగది హాస్టల్ శుభ్రత పనిని పర్యవేక్షణ చేయడం జరిగింది.

## పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం: ముక్కా

రైల్వేకోడూరు రూరల్, జూన్ 5 ప్రభాతవార్త :



పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సైకిల్‌ను తొక్కి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అందులో భాగంగా కాలుష్యాన్ని కూడా తగ్గించేందుకు ఉపయోగపడుతుందని రైల్వేకోడూరు టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరించుకొని పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా ఇందన్నా వినియోగాన్ని తగ్గించి, మన వంతు బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రయాణాలకు మోటార్ వాహనాలకు బదులుగా సైకిల్‌ను, ఈసైకిల్‌ను ఉపయోగించాలని రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యకర్తలకు, నేతలు మరియు అభిమానులకు రూపానందరెడ్డి సూచించారు. పర్యావరణ పరిరక్షణకై అవగాహన కల్పిస్తూ రైల్వేకోడూరు పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాశ్, కోడూరు పట్టణ అధ్యక్షుడు పోకల మని, క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మోలా, భుజంగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ ఉంగరాల సురేంద్ర కుమార్, గడికోట సుబ్బరాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మలిశెట్టి మురళీధర్ గౌడ్, డి.కృష్ణంరాజు, సూరప్పరాజుపల్లి మాజీ సర్పంచ్ సుబ్బరాజు, టిడిపి మండల అధ్యక్షుడు శేఖర్ రాజు, జుబైర్ తో పాటు టిడిపికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన సిద్దేశ్వర రావు

**ఓబులవారిపల్లి, జూన్ 5 ప్రభాతవార్త :** ఓబులవారిపల్లి తహసిల్దారుగా సిద్దేశ్వర రావు శుక్రవారం



బాధ్యతలు చేపట్టారు. గతంలో రెండుసార్లు ఓబులవారిపల్లెలో డిప్యూటీ తహసిల్దారుగా విధులు నిర్వహిస్తూ, ఆ తర్వాత అన్నమయ్య జిల్లా, రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయాలలో డీటీగా పనిచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓబులవారిపల్లి తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు వీఆర్వోలు శంకరయ్య రాజు మనోహర్. నిరంజన్. అంబార శ్రీనివాసులు, రాంబాబు, లక్ష్మయ్య హరిబాబు. ఓబులవారిపల్లి విఆర్ఓ ఆర్ఐ మల్లికార్జున మండల సర్వేయర్ నాగలక్ష్మి మరియు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చెట్లు నాటండి

పుల్లంపేట, జూన్ 5 ప్రభాతవార్త :

మండలంలోని కేంద్రీయ బాలుర సమీకృత హాస్టల్లో శుక్రవారం మండల అభివృద్ధి అధికారిణి జయశ్రీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ తమ వంతు ఒక మొక్క నాటినట్లయితే పర్యావరణ కాలుష్య రహిత రాష్ట్రంగా చేసుకోవచ్చని, చెట్లను పెంచడం వల్ల మంచి ఆక్సిజన్ ఏర్పడుతుందని మానవ జీవనాడికి చెట్లే ఆధారంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, మండల టిడిపి అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాస్ హాస్టల్ వార్డెన్ కె.తిరుపతి, కేశినేని నారాయణ నాయుడు, సింగం ఆదినారాయణ రెడ్డి, పంజగల వెంకటసుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జ్ సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# తిరుపతి డివిజన్

## ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు అందరూ సహకరించాలి...

### ..కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి...

తిరుపతి కార్పొరేషన్, జూన్ 5ప్రభాతవార్త



ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శుక్రవారం ఉదయం నగరంలోని జీవకోన నందు పారిశుధ్య పనుల నిర్వహణ, రైతు బజార్ నందు పారిశుద్ధ్య పనులతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి పర్యావరణ హితమైనవి వినియోగించాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కాలువలు, నాలాలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ కవర్లలో కట్టి వేసిన చెత్తచెదారం వస్తోందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య సిబ్బంది అన్ని ప్రాంతాల్లోని కాలువల్లో మట్టి, చెత్త తొలగించాలని తెలిపారు. రుతుపవనాల వలన కురిసే వర్షాలతో రోడ్లపై నీరు నిలవకుండా సజావుగా వెళ్లేలా తగుచర్యలు చెపట్టాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రమణ, మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత కావాలి.

చిట్వేలి, జూన్ 5 ప్రభాతవార్త:



అన్ని జీవరాశుల మనుగడకు ఆధారమైన ప్రకృతిని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత కావాలని స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్స వం సందర్భంగా చిట్వేలి రేంజ్ అనుంపల్లి ఫారెస్ట్ నర్సరీ వద్ద రేంజ్ అధికారి పి.ధీరజ్, ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి మొక్కలను నాటారు. అక్కడ జరుగుతున్న మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. తదుపరి వారు మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని, వేసవి తాపాన్ని తగ్గించేందుకు చెట్లను నాటడమే పరిష్కారం అన్నారు. విద్యార్థి దశ నుంచి పిల్లలకు తమ ఇంటి ఆవరణలో, గ్రామాలలో తమ పేరు మీద చెట్లను పెంచి పరిరక్షించే బాధ్యతను ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అలవర్చాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం బదులు జూట్ లేదా క్లాత్ సంచులను వినియోగించడం అలవాటు చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించి, కార్బన్ ఉద్గారాలను ఉత్పత్తి చేసే విద్యుత్తు, ఇందన మరియు ప్రకృతి వనరుల వినియోగాన్ని తగ్గించాలన్నారు.ఎఫ్ఆర్ఓ ధీరజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజులో ఒక్కరి చేత సాధ్యమయ్యేది కాదని, కానీ ప్రతి ఒక్కరూ పరిరక్షణ బాధ్యతలను చేపడితే తప్పకుండా సాధ్యమవుతుందని అన్నారు. రానున్న వర్షాలకు రేంజ్ పరిధిలోని అడవులలో రెండు లక్షల చెట్లను పెంచడమే విధిగా వేప, నేరేడు, రావి, అత్తి, దిరిసిన తదితర రకాలను విత్తనాల రూపంలో, బాల్స్ రూపంలో రూపొందించి అడవులలో వ్యక్తుల చేత, డ్రోన్ల చేత విసరడం జరుగుతుందన్నారు.ఈ బృహత్తర కార్యక్రమంలో మనమంతా భాగస్వాములు కావాలని, భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని ఎఫ్ఆర్ఓ ధీరజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై వినోద్ కుమార్, డాక్టర్ చంద్ర, టిడిపి నాయకులు గుత్తి నరసింహ, రంగయ్య,జనసేన నాయకులు మాదాసు నరసింహ, మన్మధ, ఎఫ్ ఎస్ ఓ సావిత్రి, ఎఫ్ బి ఓ కరిముల్లా అటవీశాఖ సిబ్బంది గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రగ్స్ జోలికెళ్ళొద్దు జీవితాన్ని కాపాడుకో

### -ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్యనాయుడు




***తిరుపతి,జూన్ 5ప్రభాతవార్త:*** డ్రగ్స్‌కు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజానికి ఆదర్శంగా నిలవాలని తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ డి.కొండయ్య నాయుడు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా ఎస్పీఎల్. సుబ్బ రాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ డి. కొండయ్య నాయుడు,ఈగిల్ సెల్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు "డ్రగ్స్ వద్దు బ్రో" ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. డ్రగ్స్ అలవాటు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు నేరాలకు దారితీస్తుందని వివరించారు. డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, అతివేగం, నిర్లక్ష ్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ సెల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ ప్రజాహిత పాలన



చంద్రగిరి, జూన్ 5 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాహిత పాలన సాగిస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని మామండూరులో శుక్రవారం ఎంఎల్ఏ పులివర్తి నాని, ఆర్‌డిఓ రామ్మోహన్, కూటమి నాయకులతో కలసి 165 మంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. బ్రిటీష్ కాలం నాటి హద్దులపై కూటమి ప్రభుత్వం సమగ్రవంతంగా రీ సర్వే చేయించి పాస్‌బుక్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రైతుల పాస్‌బుక్‌లపై వైసిపి నేతల ఫోటోలను ముద్రించుకున్నారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో రైతులు తమ భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు, పొరబాట్లు వున్నట్లయితే విఆర్ఓ దృష్టికి తీసుకువస్తే మోడల్ పాస్‌బుక్‌లో సవరించి ఒరిజినల్ పాస్‌బుక్‌లో నమోదు చేయించి అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, సింగిల్ విండో ఛైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోతల ప్రవీణ్‌కుమార్, డిపూటీ తహశీల్దార్ దివాకర్, విఆర్ఓ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు



**చంద్రగిరి జూన్ 5 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగా పురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని శ్రీనివాసుడు తన దేవేరులు శ్రీదేవి భూదేవి సమేతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## రాయలమ్మకు ప్రత్యేక పూజలు



**రామచంద్రాపురం, జూన్ 5 ప్రభాతవార్త:** రాయలచెరువు కట్టపై వెలసియున్న రాయలమ్మకు పివి పురం గ్రామస్థులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, డప్పులు వాయిస్తూ, భాణాసంచా పేల్చుతూ పొంగళ్ళను మోసుకుంటూ రాయలచెరువు కట్టవద్దకు చేరుకున్నారు. అమ్మవారికి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, పసుపు కుంకుమలను అలంకరించి, నూతన వస్త్రాలతో అందంగా ముస్తాబు చేశారు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

## రెండేళ్ల చంద్రబాబు వెన్నుపోటుపై నిరసన



ప్రభాతవార్త, జూన్ 5 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చక ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినే శ్రీ వైయస్ జగన్ మోహన్ ఆదేశాల మేరకు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం తడ పట్టణం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు దిట్టఅని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి అందిస్తామని చెప్పిన హామీ ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. ప్రతి నిరుద్యోగునికి నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పిన చంద్రబాబు రెండేళ్లలో ఎంతమందికి అందించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా ఎన్నో ఇచ్చిన హామీలు నెరవేర్చక ప్రజలను కూటమి ప్రభుత్వం రెండేళ్లు వెన్నుపోటు పొడిచిందనీ ధ్వజమెత్తారు. ప్రజలకు అందవలసిన సంక్షేమ పథకాలు అందక పోగా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ కెళివి ఆర్ముగం, రమేష్, వాసు, రాజ్ కుమార్, తిరుమలరెడ్డి, మురుగన్, సుందర్‌రెడ్డి, పరంశివం రెడ్డి, చిన్నప్పన్ రమేష్, ప్రకాష్, మన స్వామి రెడ్డి, రాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## హరిత విప్లవంతో పర్యావరణ పరిరక్షణ : ఎమ్మెల్యే



సూళ్ళూరుపేట, జూన్ 5 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి హరిత విప్లవానికి నాంది పలికితే పర్యావరణాన్ని పరిరక్షించు కోవచ్చునని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం పర్యావరణానికి అధిక ప్రాముఖ్యత ఇస్తుందని ఆమె తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది తెలుగుదేశం పార్టీ అని ఆమె తెలిపారు. రోజు రోజుకి అడవులు అంతరించిపోవడంతో పాటు చెట్లను యదేచ్ఛగా నరికి వేయడంతో వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా పులికాట్ సరస్సు పై ముద్రించిన ప్రత్యేక పుస్తకాన్ని స్థానిక డిఎఫ్ఓ హరిత ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి అందజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే స్థానిక వై జంక్షన్ నుండి సైకిల్‌పై ర్యాలీగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతో రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఎజి కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, చిట్టేటి పెరుమాళ్ళు, పాకం వెంకటసుబ్బయ్య, కట్ట బోయిన వెంకటేష్ యాదవ్, అలీ భాయ్, తహసిల్దార్ శైల కుమారి, ఎంపీడీవో మురళి, సీఐ ఎం మురళీకృష్ణ, షార్ వాతావరణ శాస్త్రవేత్త మహంతి, మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.




## నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపిన లోకేష్ : ఎమ్మెల్యే



చిట్టమూరు, జూన్ 5 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ, పోలీస్ రిక్రూట్మెంట్ ద్వారా వేల మంది నిరుద్యోగుల కల సాకారం అయ్యేలా శాశ్వత ఉద్యోగాలు కల్పించింది లోకేష్ బాబు అని గూడూరు శాసన సభ్యులు సునీల్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం చిట్టమూరు మండలంలోని గుణపాడు గ్రామంలో ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌తో కలిసి ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజల వద్దకు జిల్లా అధికారులను సైతం రప్పించి వారి సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి ఎనలేని దని కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి మొత్తం వివిధ శాఖల ద్వారా 66 అర్జీలను అధికారులు స్వీకరించినట్లు తహసిల్దార్ రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు చిట్టమూరు, వాకాడు తాసిల్దారులు రామయ్య, ఇక్బాల్ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్, చిట్టమూరు మండల పార్టీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, స్థానిక టిడిపి నేతలు మధు రెడ్డి, అంకబాబు, గణపతి, మోహనయ్య, సుధీర్‌తో పాటు మండలంలోని తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

తడ, జూన్ 5 ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తడ మండల అభివృద్ధి అధికారి శేఖర్‌నాయక్ వారి సిబ్బందితో కలిసి తడ పట్టణంలోగల కస్తూర్బ గాంధీ బాలికల పాఠశాల నందు శుక్రవారం మొక్కలు నాటారు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు ఉపాధి హామీ సిబ్బంది కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు...

## బాబు వెన్నుపోటుకు రెండేళ్లు



సూళ్లూరుపేట, జూన్ 5 ప్రభాతవార్త: సూళ్లూరు పేటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బాబు వెన్నుపోటుకు రెండేళ్లు అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి వెన్నుపోటు పొడిచి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చంద్రబాబు పాలనను నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహణలో అవినీతితో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని అన్నారు. రెండేళ్లలో అభివృద్ధి శూన్యమని కేవలం ప్రచార ఆర్భాటం తప్ప ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కంటి తుడుపు చర్యలుగా చేపడుతున్నారని సంజీవయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి, జట్టి వేణు యాదవ్, వి.కృపాకర్‌రెడ్డి, చిన్ని సత్యం, తుపాకుల ప్రసాద్, వంక దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్‌చే ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సూళ్లూరుపేట, జూన్ 5 ప్రభాతవార్త: వాసవి క్లబ్, యాధుమది సమీకృత పట్టణ, గ్రామీణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక విఎస్ఎస్‌సి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్‌కు చెందిన సాయిరాం, దేసు బాలకృష్ణ, యాదుమది సమీకృత పట్టణ, గ్రామీణాభివృద్ధి సంఘం ప్రతినిధి వీరస్వామి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శర్మ, ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ యేడుకొండలు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో నైతిక విలువలు పాటించాలి: డిఎస్పి



సూళ్లూరుపేట, జూన్ 5 ప్రభాతవార్త: విధి నిర్వహణలో జాగ్రత్తతో పాటు నైతిక విలువలను పాటించాలని నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణములో సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని పోలీసులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన అవసరం, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో పాటించాల్సిన విధానాల గురించి ఆయన వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, సూళ్లూరుపేట ఎసైలు అజయకుమార్, సుబ్రహ్మణ్యం రాజు, తడ ఎస్ఐ కొండపనాయుడు, శ్రీహరికోట ఎస్ఐ భానుప్రసన్న, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిస్వార్థంగా చేయడమే లక్ష్యం : ఎంపిపి



సూళ్లూరుపేట, జూన్ 5 ప్రభాతవార్త: ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకోని పని చేస్తున్నాని స్థానిక ఎం.పి.పి అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్సార్సీపి కార్యాలయంలో అభిమానుల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజా సేవ చేసేందుకు కంకణ బద్ధుడినై పని చేస్తున్నానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీబలోపేతానికి కృషి చేయడంతో బాటు, కార్యకర్తలకు అండగా, ఉండాలని చెప్పారు. పలు వృద్ధాశ్రమాల్లో అనదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు జట్టి వేణు యాదవ్, అయిత శ్రీధర్, అలవల సురేష్, మీజూ రామకృష్ణారెడ్డి, అముజుల విజయలక్ష్మి, ముంగర అమరావతి, ఆబాక రమేష్ రెడ్డి, వి.కృపాకర్ రెడ్డి, ప్రసాద్, బి.మోహన్ రెడ్డి, మాదరపాక సురేష్, భగవాన్ దాస్, చిలక యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులే విత్తనోత్పత్తి చేపడితే అదనపు ఆదాయం

తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త: రైతులకు నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం, నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తత పెంచడం, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్ధతులను పరిచయం చేయడం లక్ష్యంగా ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో శుక్రవారం విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ సహ పరిశోధన సంచాలకులు డా. వి. చంద్రిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డా. పి. మునిరత్నం మాట్లాడుతూ రైతులు తమ అనుభవాలకు శాస్త్రవేత్తల సాంకేతిక సూచనలను జోడించి రైతు స్థాయిలోనే విత్తనోత్పత్తి చేపడితే అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మొక్కల ప్రజనన విభాగాధిపతి డా. ఎస్. వసుంధర మాట్లాడుతూ పంట విజయవంతం కావడంలో సరైన విత్తన రకం ఎంపిక అత్యంత కీలకమని, భూసార పరీక్షల ఆధారంగా ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎస్‌వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.ఎం.రెడ్డి శేఖర్ మాట్లాడుతూ రైతులు నేల స్వభావం, నీటి లభ్యత, విత్తన నాణ్యత, రుతుపవనాల గమనంపై అవగాహన పెంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి డా. ఎస్. ప్రసాద్ రావు మాట్లాడుతూ భారత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఏడాది జూన్ 5న విత్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి. స్వాతి, డా. కె. జాన్, డా. బి. రూపేష్ కుమార్ రెడ్డి, డా.టి. మురళీకృష్ణ, డా. టి.ప్రతిమ, డా. కె.వి.నాగమాధురి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన రైతులతో పాటు ఆర్ఏఆర్ఎస్, ఏరువాక కేంద్రాలు, కేవీకేలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన పంట రకాలు, బయోపెస్టిసైడ్లు, జీవన ఎరువులు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.













## ఓం శ్రీ వారాహి సమేత మున్మథ భైరవ ఆలయ అష్టబంధన కుంభాభిషేకం

పుత్తూరు రూరల్, జూన్ 5 ప్రభాతవార్త: పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలో ఉన్న ఓం శ్రీ దక్షిణ కాశీ వారాహి అమ్మవారి శక్తి పీఠం, కణం మిట్ట పుత్తూరు బైపాస్ రోడ్డులో వెలసిన అమ్మవారి రోడ్డు మరమ్మతులపై నూతన ఆలయ నిర్మాణంలో ఓంశ్రీ వారాహిసమేత ఉన్నంద భైరవ ఆలయ అష్టబంధన మహాకుంభాభిషేకం 7వ తేదీ ఆదివారం ఉదయం ఆలయ చైర్మన్ మోహన్ అమ్మల్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ఎంబీ ఆది నాయుడు, పి.కె.హరి, చిన్నదొరై, ప్రవీణ్‌నాయుడు, కె.మంజునాయుడు, మేనేజర్ హేమంత్ నాయుడు, ఎన్.వెంకటేష్ వారిచే ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించబడుతుందన్నారు.

## కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు సన్మానం



తిరుపతి, జూన్ 5ప్రభాతవార్త: కేంద్ర పరిశ్రమలువాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ శుక్రవారం ఉదయం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వెలుపల బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మంత్రికి స్వాగతం పలికారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పియూష్ గోయల్‌కు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించి, దుశ్శాలువతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, విశ్వనాథ్, మనీ, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటిన చైర్మన్



శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి అధ్యక్షతన దేవస్థానంకు అనుబంధమైన గంగాసదన్ పరిసరాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవంను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మెన్ ఎంఏ షరీప్ మహమ్మద్ హాజరయ్యారు. ఆయనకు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా ఆయన చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్‌తోనూ, అలాగే మైనారిటి నాయకులతో కలసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లు నాటారు. అలాగే నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఒక్కరు ఇందన పొదుపులో భాగంగా ఇంధనం వాడకం వాహనాలకు స్వస్తి చెప్పి సైకిల్‌ను ఉపయోగించు కోవాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో సైకిల్ ఒక భాగం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఇక పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు లేదా పరిసరాల్లో ఒక చెట్టునాటి దానిని పరిరక్షించాలని పిలుపు నిచ్చారు. నేటి స్పీడ్‌యుగంలో మనుషులు పరుగులు తీస్తున్నారని పరుగులు ఆపి నడక అలవాటు చేసుకోవాలని షరీప్ పిలుపు నిచ్చారు. ఏదైనా సాధ్యమే అని మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరూపిస్తున్నారని ఆయన అడుగుజాడల్లో నడవాలని షరీఫ్ సూచించారు.

**దేవస్థానం సారధ్యంలో 2.5కోట్ల మొక్కలు: చైర్మెన్**

చైర్మెన్ కొట్టు సాయి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి దేవస్థానం సారధ్యంలో 2.5కోట్ల సీడ్స్ విత్తనాలను తయారు చేసినట్లు వివరించారు. వాటిని డ్రోన్ల సహాయంతో గిరి ప్రదక్షిణ మార్గంలో వేసి రానున్న వర్షాకాలంలో ఈ సీడ్స్ చెట్లుగా అబివృద్ధి చెందేటట్లు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నేడు భరద్వాజ తీర్థంలోని ఆవరణలో మొక్కలు నాటామన్నారు. ఈ క్యాక్రమాలకు ముఖ్యఅతిధిగా మైనారిటి నాయకులు షరీఫ్‌మహ్మద్ రావటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడిమలం ఆలయంలో మంత్రి టి.జి.భరత్



శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త: శుక్రవారం గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో పరిశ్రమల శాఖామంత్రి టి.జి భరత్ స్వామి వారి దర్శనానికి విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, కార్యనిర్వహణాధికారి స్వాగతం పలికి, స్వామి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చక్రస్నానంతో వైభవంగా ముగిసిన...

## కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, జూన్ 5 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న నారాయణ వనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి శుక్రవారం చక్రస్నానంతో ముగిసింది. అంతముందు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు పల్లకీలో నగరవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి 8 గంటలకు కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్స వాలకు సంబంధించి ధ్వజావరోహణంతో ముగిసింది. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం తామరగుంట పుష్కరణీలో శ్రీవారికి సుదర్శన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. మండల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు చక్రస్నాన వేడుకలను తిలకించడానికి తరలివచ్చారు. దీంతో తామరగుంట పుష్కరణీ భక్తులతో నిండిపోయింది. వేలాదిమంది భక్తుల సమక్షంలో శ్రీవారికి చక్రస్నానం నిర్వహించారు. భక్తుల గోవిందనామా స్మరణతో పుష్కరిణి కళ కళలాడింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ డిఇఇ భాస్కర్, జయ రామనాయక్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ నరసింహులు, టిటిడి విజిలెన్స్ ఎవిఎస్ఓ రాదకృష్ణ, మోహన్‌కృష్ణ, టిటిడి ఇంజనీర్ ఎఇఇ గురుప్రసాద్, ఎలక్ట్రిసిటీ డిఇ రవిశంకర్, డివైఇఇ మురళీకృష్ణ, ఎఇ దొరైరాజ్, చిరంజీవి, సిఐ రవీంద్ర, ఎస్ఐలు గిరిబాబు, ఓబయ్య, రాఘవేంద్ర, ఎఎస్ఐలు, సిబ్బంది, టిటిడి విజిలెన్స్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, పంచాయతీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్‌ను అడ్డుకొని మా గ్రామాలను కాపాడండి




తిరుపతి హెల్త్, జూన్ 5 ప్రభాతవార్త: గడిచిన మూడేళ్ల కాలంగా నేటి వరకు తిరుపతి జిల్లా పరిధిలోని పిచ్చాటూరు, నాగలాపురం మండలం, సురుటుపల్లి సమీపంలో ఉన్న 23 గ్రామాల ప్రజలు అక్రమ గ్రావెల్ తవ్వకాలతో తాగునీటికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులు వచ్చాయని, గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి మా గ్రామాలను కాపాడండి అని ఎస్ఎస్ బి పేట విలేజ్ పబ్లిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చంద్రన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. పిచ్చాటూరు మండలం, నాగలాపురం మండల పరిధిలో 24 గంటలపాటు అక్రమ గ్రావెల్, అక్రమ ఇసుక తవ్వకాలతో 23 గ్రామాల ప్రజలు ఇటు వ్యవసాయానికి, మూగజీవాల దాహార్తి తీర్చడానికి, బోరులో నీరు ఎండిపోతూ తీవ్ర అవస్థలకు గురవుతున్నామని వాపోయారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరించే కూరపాటి శంకర్ రెడ్డి, ఆయన అనుచరులు యదేచ్ఛగా గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఉన్నాగాని ప్రకృతి సహజ సంపదను దోచుకుంటూ తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తిరుపతి జిల్లా కలెక్టర్ కు, జిల్లా మైనింగ్ అధికారికి, జిల్లా పోలీసు అధికారికి ఇలా అనేక విభాగాలకు చెందిన అధికారులకు వినతులు ఇచ్చినా కూడా పట్టించుకునే నాధుడు లేదన్నారు. పైగా అక్రమ గ్రావెల్ రవాణాపై ప్రజలతో కలిసి పోరాడుతుంటే అక్రమ కేసులు పెట్టిస్తున్నారని వాపోయారు. ప్రకృతి వనరులను రక్షించాల్సిన అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో మా 23 గ్రామాల ప్రజలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోతున్నామన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతూ బోర్లలో నీరు రావడంలేదని, ఇలానే ఇంకొన్నాళ్ళు గడిస్తే ఆ ప్రాంతంలో మనుషులు ఉండడానికి కూడా అసాధ్యమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కలుగజేసుకొని అక్రమ గ్రావెల్, అక్రమ ఇసుక రవాణాపై పూర్తిస్థాయి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బాబు నాయుడు, కోశాధికారి బాలాజీ, మనోహర్, ఢిల్లీ రెడ్డి, విల్సన్, మధుబాబు, రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.












## ఈ-ఫైలింగ్ 3.0లో న్యాయవాదుల నమోదు తప్పని సరి

**తిరుపతి(లీగల్), జూన్ 5 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయస్థానాల్లో ఈ-ఫైలింగ్ 3.0వ్యవస్థ అమలుకు చర్యలు వేగవంతమయ్యాయి. బెయిల్ పిటిషన్లను ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేసే విధానాన్ని పైలట్ ప్రాజెక్టు ప్రాతిపదికన అమలు చేయనున్న నేపథ్యంలో చిత్తూరు ఇజిల్లా యూనిట్ పరిధిలోని అన్ని అడ్వకేట్లు, అడ్వకేట్ క్లర్కులు ఈ-ఫైలింగ్ 3.0 పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని జిల్లా న్యాయ వ్యవస్థ సూచించింది. ఈ మేరకు చిత్తూరు ప్రధాన జిల్లా న్యాయమూర్తి కార్యాలయం నుంచి సర్క్యూలర్ విడుదలైంది. జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులు, క్లర్కులు తమ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పేర్కొంది. అలాగే బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు ఈ సమాచారాన్ని సభ్యులందరికి చేరవేసి, ప్రతి అడ్వకేట్, అడ్వకేట్ క్లర్క్ నమోదు ప్రక్రియపూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూన్ 10లోపు పూర్తి చేసి సంబంధిత వివరాలను కోర్టుకు సమర్పించాలని సర్క్యూలర్‌లో స్పష్టం చేశారు. ఈ అంశాన్ని అత్యంత అత్యవసరంగా పరిగణించాలని జిల్లా న్యాయవ్యవస్థ పేర్కొంది.

## జలధార-జలహారతితో రైతులకు రెట్టింపు ప్రయోజనం..



**తిరుపతి కలెక్టరేట్, జూన్ 5 ప్రభాతవార్త :** భూమిపై పడే ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టుకుని భూగర్భ జలాలుగా మార్చే ప్రక్రియ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జలధార-జలహారతి కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణ పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైతులకు అవసరం అయ్యే ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులను, చెరువులు, చెక్ డ్యామ్ లలో పూడికతీత, మరమ్మత్తు పనులను, కాంటూరు కందకాలు, తదితర నీటి సంరక్షణ పనులను ఉపాధి హామీ ద్వారా చేపట్టింది. దొరవారిసత్రం మండలంలో జలధార – జల హారతి కార్యక్రమం క్రింద రూ.4.24 కోట్ల అంచనా వ్యయంతో 78 పనులకు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 5 ఫీడర్ కాలువల పునరుద్ధరణ, 2 చెక్ డ్యాం లలో పూడికతీత పనులు, 30 చెరువులు పూడికతీత 41 నీటి కుంటలో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా మండలంలోని 4683 ఎకరాలకు లబ్ధి కలగనుంది. దొరవారిసత్రం మండలంలోని ఐయ్యపాలెం గ్రామ పంచాయితీలో 68 మంది ఉపాధి హామీ వేతన దారులతో 1500 మీటర్ల పొడవు, 6.0 మీటర్ల వెడల్పు గల ఐయ్యపాలెం చెరువు కాలువ పూడికతీత పనులను రూ.3,72,188/ అంచనా విలువతో చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు ఈ కాలువద్వారా ఐయ్యపాలెం చెరువుకు వెళ్తుంది. ఈ కాలువ పనులు చేపట్టడం ద్వారా కొత్త ఐయ్యపాలెం పంచాయితీతో పాటు తల్లంపాడు మరియు మేలుపాక ప్రాంతాలలోని రైతుల భూములకు సాగు నీరు అందనుంది. తద్వారా ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ,మిరప , వరి పంటలకు నీరు సమృద్ధిగా చేకూరుతుంది. చెరువు పరిధిలో 212 ఎకరాలకు సాగునీరు, 21బోర్లు, 11 బావుల్లో భూగర్భ జలాల పెరుగుదల. బండి సుభాషిణి ఉపాధి హామీ వేతనదారురాలు మాట్లాడుతూ జలధార జలహారతి పథకం క్రింద తమ గ్రామంలో ఐయ్యపాలెం చెరువు కాలువ పనులను చేస్తున్నామన్నారు. మినిమానముడి ఫారెస్ట్ భూమి నుండి ఐయ్యపాలెం చెరువు వరకు ఈ కాలువ పని కొనసాగి ఐయ్యపాలెం చెరువులోకి ఈ నీరు చేరుతుందన్నారు. ఈ చెరువు క్రింద 212 ఎకరాల భూములకు సాగునీరు, 21 బోర్లు, 11 బావులలో భూగర్భ జలాలు పెరిగి వ్యసాయానికి మేలు కలుగుతుందన్నారు.

పైడి ధర్మయ్య ఉపాధి హామీ వేతనదారుడు మాట్లాడుతూ, ఈ కాలువ పనులు చేపట్టడం ద్వారా రైతుల బోర్లు, బావులలో నీటి మట్టాలు పెరిగి వ్యవసాయం చేసుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా పశువులు, గొర్రెలు, మేకలు లాంటి జీవాలకు త్రాగు నీటి కొరత కూడా తీరుతుందన్నారు. జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా దొరవారిసత్రం మండలంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు రైతులకు సాగునీరు అందించడమే కాకుండా భూగర్భ జలాలను పెంచి, పశువులకు తాగునీరు అందించేలా మేలు చేశాయి. ఈ కార్యక్రమం నీటి సంరక్షణతో పాటు ఉపాధి కల్పనను సమన్వయం చేసిన ఒక సుస్థిర అభివృద్ధి నమూనాగా నిలుస్తోంది

## పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గం



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పర్యావరణ విజ్ఞాన శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణం మానవ జీవనాధారమని, స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం వంటి ప్రకృతి సంపదలన్నీ పర్యావరణం ద్వారానే లభిస్తాయని అన్నారు.కార్యక్రమంలో డాక్టర్ భద్రమణి, డాక్టర్ విద్యుల్లత, డాక్టర్ సాయికుమారి, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శిరీష, డాక్టర్ వసుధ, వెంకటలక్ష్మి శ్రీ, నాగపద్మ, డాక్టర్ లక్ష్మి శ్రీ, డాక్టర్ లక్ష్మి శ్రీదేవి, డాక్టర్ శీలత, డాక్టర్ కుముదిని, డాక్టర్ బాలకృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల చేతులో...కూటమి ప్రభుత్వం



**శ్రీకాళహస్తి జూన్ 5 ప్రభతవార్త :** కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థ పాఠ్యపుస్తకాలు అమ్మితే అడ్డుకుంటాం. తిరుపతి జిల్లా వ్యాప్తంగా చైనా, ప్రైవేట్ విద్యా సంస్థలు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పాఠ్యపుస్తకాలు, టై,యూనిఫామ్ అన్నీ కూడా మా పాఠశాల లోనే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను చెప్పడం హాస్యాస్పందం అని పిడిఎస్‌యు జిల్లాఅధ్యక్షు, కార్యదర్శులు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. కుమార్‌కి వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జాకీర్, లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ఏమో పాఠ్యపుస్తకాలు ఇతర సామాగ్రిని విద్యార్థులు తల్లిదండ్రులకు నచ్చిన చోట కొనుగోలు చేసుకోవచ్చు అని రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్నే మరోపక్కేమో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.కుమార్ డిప్యూటీ డిఈఓ, ఎంఈఓ లు ఎవరు కూడా కన్నెత్తు కూడా చూసిన పాపాన పోవడం లేదు. తక్షణమే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోతే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ సర్వేపల్లి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడుదాం...చెట్లను నాటదాం



**తొట్టంబేడు, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిట్టత్తూరు గ్రామంలో గ్రామ అభివృద్ధి అధికారిని శాంతి శుక్రవారం గ్రామస్తులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రకృతిని కాపాడడం, చెట్లు నాటడాన్ని ప్రోత్సహించడం, భూమిని రక్షించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం అని,పర్యావరణానికి ఎదురవుతున్న సవాళ్లను గుర్తు చేస్తూ, సుస్థిర భవిష్యత్తు కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నేడు తెలియజేస్తుందని, ప్రస్తుతం పర్యావరణం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ కార్యక్రమంలో చిట్టత్తూరు సచివాలయ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మన పర్యావరణమే మన ఆయుష్షు!



**శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మొక్కలు నాటడం జరిగిందని పేట బ్రదర్స్ చంద్రశేఖర్, చిరంజీవి అన్నారు. మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చేపట్టిన 2.5 కోట్ల సీడ్ బాల్స్ కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యత కలిగినటువంటి కార్యక్రమం, దీని ద్వారా చెరువుగట్టులు, ఖాళీ ప్రదేశాలు, మొక్కలు లేనటువంటి ప్రదేశాలు, కొండ గట్టులు మొదలగు ప్రాంతాలలో ఈ సీడ్ బాల్స్ ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మనీ, నక్కా ప్రసాద్, మహర్షి రెడ్డి, లక్ష్మణ్, నాగరాజు, సాయి, పసల ఎలీషా వీర మహిళ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత పాల్గొన్నారు.

## నగర వనంలో 2.5కోట్ల సీడ్ బాల్స్‌తయారి



**తొట్టంబేడు,జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో నగరవనంలో 2.5కోట్ల సీడ్ బాల్స్‌ను తయారుచేస్తున్నట్లు ఫారెస్టు రేంజర్ లోకేష్ శుక్రవారం తెలిపారు. డెప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా 'సీడ్‌బాల్స్' తయారి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు లోకేష్ వివరించారు. శ్రీకాళహస్తి రేంజ్‌లోని నగరవనంలో విస్తృతస్థాయిలో రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌ముఖ్యఅతిధిగా హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ రేంజర్స్ దేవరాజులు,ప్రవీణ్ ఎస్,ఎన్‌జీవో సభ్యులు, అటవీశాఖ అధికారులు, బైరాజుకండ్రిగ గ్రామస్తులు,విద్యార్థులు వనసంరక్షన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## 'సూపర్ సిక్స్' హామీలు గాలికేనా?

*-చంద్రబాబు పాలనపై వైయస్సార్‌సిపి ఆగ్రహం*

*-తిరుపతిరూరల్లో మేనిఫెస్టో దహనం...భారీ నిరసన*



**తిరుపతిరూరల్,జూన్5 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం చోటు చేసుకుందని ఆరోపిస్తూ వైయస్సార్‌సిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ళు' పేరుతో భారీ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో తిరుపతిరూరల్ వైసిపి అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళ పల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చంద్రగిరి – తిరుపతి ప్రధాన రహదారిపై సూపర్ సిక్స్ హామీల పత్రాలు, టిడిపి మేనిఫెస్టో ప్రతులను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, మాజీ ఎంపిపి మూలం చంద్రమోహన్‌రెడ్డి, చెవిరెడ్డి రఘునాథరెడ్డి, విప్పర్ల వాసుదేవనాయుడు, అవిలాల లోకనాథరెడ్డి, చిన్ని యాదవ్, జోగి మోహన్, మొక్కల భారతి, దామినేటి కేశువులు, ఎంపిటిసి జైకర్, లక్ష్మీనారాయణ, తుటిసుధాయాదవ్,చెంచుమోహన్‌యాదవ్, తమ్మిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, కరమల్ల వల్లీ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలి



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** ఎస్వీయూ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వద్ద ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టర్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రకృతిలో అంతర్భాగమని, పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని ప్రకృతిని అందించాలంటే నేటి తరం మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్ర విభాగం ఆచార్యులు దామోదరం, ఆచార్య నరసింహ, ఇంజనీర్ తాండవకృష్ణ, డాక్టర్ రమేష్‌బాబు, విశ్వవిద్యాలయ ఉద్యోగులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గేట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్, ఇంజినీరింగ్ విభాగాల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించింది.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రీజినల్ సైన్స్ సెంటర్ సహకారంతో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు నగలపాటి నాగేశ్వరరాజు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత పరిరక్షణలో అడవులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సేంద్రీయ ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ముఖ్యమైన సందర్భాల్లో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, దైనందిన జీవితంలో పర్యావరణహిత అలవాట్లను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రీజినల్ సైన్స్ సెంటర్, తిరుపతి సైంటిఫిక్ ఆఫీసర్ పురుషోత్తం, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు బి.వై. ముని ప్రసాద్, చి. రాజశేఖర్, జోనల్ కార్యాలయం ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సి. జ్యోతి మనోహర్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.పాల్గొన్న వారికి టీషర్టులు, క్యాప్‌లు, జూట్ సంచులు పంపిణీ చేశారు.

## భాషా శాస్త్రవేత్త భాస్కర రాజుకు ప్రతిష్ఠాత్మక పురస్కారం



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని గంగా సదన్‌లో నిర్వహించిన సాహిత్య, భాషా-సాంస్కృతిక కార్యక్రమంలో ప్రముఖ భాషా శాస్త్రవేత్త, విద్యావేత్త డా. సంగరాజు భాస్కర రాజుకు ప్రతిష్ఠాత్మక జాతీయ వాగ్దేవి పురస్కారం ప్రదానం చేశారు.తెలుగు భాషాభివృద్ధి, భాషా పరిశోధన, విద్యా రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు, విద్యావేత్తలు, భాషా పరిశోధకులు డా. భాస్కర రాజును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పురస్కారం అందుకున్న డా. సంగరాజు భాస్కర రాజు మాట్లాడుతూ ఈ గౌరవానికి జాతీయ తెలుగు సారస్వత పరిషత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తెలుగు భాషాభివృద్ధి, పరిశోధన రంగాల్లో మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నేడు జనవాణి కార్యక్రమం



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జనవాణి కార్యక్రమం శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరుపతిలోని తన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా సమర్పించవచ్చని ఆయన సూచించారు. వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటున్నందున తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్‌డీఏ కూటమి నాయకులు తమ డివిజన్లలోని సమస్యల పరిష్కారానికి జనవాణిని ఒక వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. వినతిపత్రం సమర్పించే వారు ఆధార్ కార్డు ప్రతిని తప్పనిసరిగా జతపరచాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.

## ఎం ఎన్ ఓ, ఎఫ్ఎన్ఓలు ఏఐటియుసిలో చేరిక ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**తిరుపతి హెల్త్, జూన్ 5, ప్రభాతవార్త** తిరుపతి రుయా హాస్పిటల్ నందు ఎంఎన్ఓ, ఎఫ్ ఎన్ ఓలు ఏఐటియుసిలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి కే రాధాకృష్ణ, ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేంద్రలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగుల సీనియ్యారిటీ లిస్ట్ రెడీ చేసి ప్రమోషన్ ఇవ్వాలి గతంలో 6 మంది దోబీలు పనిచేయడం జరిగేదని ఇప్పుడు ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారని మిగిలిన ఖాళీలు భర్తీ చేయాలని గతంలో 7 మంది వాటర్ మెన్స్ పని చేస్తుంటే ఇప్పుడు నలుగురు మాత్రమే పనిచేస్తున్నారని ఆప్ కాస్‌లో పని చేసే ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఏలకు 35 సిఎల్‌లు ఇవ్వాలిసి ఉండగా 15సిఎల్‌లు మాత్రమే ఇస్తున్నారు ఇలా చెప్పుకొంటే చాలా ఉంది ఈ ఎస్ ఐ కట్ అవుతున్నా కార్మికుల ఖాతాలలో జమ కావడంలేదు కొత్తగా చేరిన అటెండర్ లకు 5 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని వారు అన్నారు. ఏఐటీయూసీలో ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు చేరిన వారిని ఏఐటీయూసీ ఖండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు జ్యోత్స్న కళావతి అజయకుమార్ రాణి వాసంత విజయ నిర్మల మునికుమారి సుదీర్, శ్రీకాంత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లాలో 13మంది తహశీల్దార్ల బదిలీలు

**కుప్పం, జూన్ 5 ప్రభాతవార్త** :చిత్తూరు జిల్లాలో 13మంది తహశీల్దార్లను డెప్యుటేషన్, ఇన్‌చార్జ్ తహశీల్దార్లుగా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపంజాణి తహశీల్దార్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబును కుప్పం తహశీల్దార్‌గా డెప్యుటేషన్‌పై నియమించారు. అలాగే ఎస్ఆర్‌పురం తహశీల్దార్‌గా పనిచేస్తున్నను గంగవరం తహశీల్దార్‌గా బదిలీ చేశారు. బైరెడ్డిపల్లి తహశీల్దార్ షేక్ ఖాజీ వలీని ఎపి హైకోర్టు లైజన్ ఆఫీసరుగా నియమించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో భూవిభాగం తహశీల్దార్‌గా ఉన్న కళ్యాణిని చిత్తూరు రూరల్ మండల తహశీల్దార్‌గా డెప్యుటేషన్‌పై నియమించారు. అలాగే పూతలపట్టు తహశీల్దార్ రామకృష్ణను ఐరాల తహశీల్దార్‌గా, పెనుమూరు తహశీల్దార్ తనూజను శాంతిపురం తహశీల్దార్‌గా బదిలీ చేశారు. కుప్పం తహశీల్దార్ చిట్టిబాబును కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐరాల తహశీల్దార్ లోకేశ్వరిని పెనుమూరుకు, వి.కోట తహశీల్దార్ ఉదయ్ సంతోష్ పూతలపట్టు తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. నగరి ఆర్డీఓ కార్యాలయం డిటిగా ఉన్న మునిశైలజను విజయపురం తహశీల్దార్‌గా(ఎఫ్ఎసి), కుప్పం డిప్యూటీ తహశీల్దార్ సూర్య ప్రకాష్ నాయక్‌ను వి.కోట తహశీల్దార్ (ఎఫ్ఎసి)గా నియమించారు. అలాగే బైరెడ్డిపల్లి తహశీల్దార్‌గా పనిచేస్తున్న ప్రసన్న కుమార్‌ను బైరెడ్డిపల్లిలో తహశీల్దార్ (ఎఫ్ఎసి)గా, పెద్దపంజాణి ఉప తహశీల్దార్‌గా పనిచేస్తున్న రామూర్తిని పెద్దపంజాణి తహశీల్దార్ (ఎఫ్ఎసి)గా నియమించారు.

# తిరుపతి డివిజన్

## కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఘన స్వాగతం



**నారాయణవనం, జూన్ 5 ప్రభాతవార్త :** కేంద్ర మంత్రివర్యులు పియూష్ గోయల్, రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రివర్యులు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఇంచార్జీ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను శుక్రవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇంచార్జీ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోసత్యవేడునియోజకవర్గంలోజరుగుతున్న రాజకీయం పరినామాలన గురించి చర్చించుకున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కోసం శిక్షణ



**నారాయణవనం, జూన్ 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక రోజు మధ్యాహ్నంభోజనం తయారు చేసే వంటదారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఓ1 కోదండనా యుడు, ఎంఇఓ2 చంద్రశేఖర్‌శెట్టి, విజయవాడ టాటా చారిటబుల్ పౌండేషన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జె రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనంలో పోషణతో కూడిన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆహార నమూనాలు, ఫోర్టిఫిడ్ ఆహార అవసరం, ఫోర్టిఫిడ్ బియ్యం వినియోగం, సరైన వంట విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు మరియు పోషక విలువలు కాపాడే వంట పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వంట నిర్వాహకులకు వంట తయారీపై పోటీ నిర్వహించి ముగ్గురు విజేతలకు బహుమతులను అందించారు.

## పొగాకుకు దూరం వుండాలి

**నారాయణవనం, జూన్ 5 ప్రభాతవార్త :** పిచ్చాటూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నారాయణవనం మండలం కశింమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరీ వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమంను సిడిపిఓ సౌభాగ్యమ్మ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ బేబీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యక్త వయస్సు కలిగిన బాల బాలికలు మద్యం, పొగాకు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా వుండాలన్నారు. ప్రతి ఒక్కరు మంచి నడవడికతో పెరగాలన్నారు. ఇకపోతే సెల్‌ఫోన్ ఎక్కువగా వాడకూడదన్నారు. వ్యక్తిగత శుభ్రత చాలా అవసరమన్నారు. గర్భవతులకు, బాలింతలకు టిహెచ్ఆర్ పిల్లలకు ఐవిఆర్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వాణిశ్రీ, కిషోరీ బాలికలు పాల్గొన్నారు.

## నారాయణవనంలో చింతామోహన్ పర్యటన




**నారాయణవనం, జూన్ 5 ప్రభాతవార్త :** కేంద్ర మాజీ మంత్రివర్యులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత, తిరుపతి మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ శుక్రవారం ఉదయం మండలకేంద్రంలోని ఎగువ పద్మశాలీవీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా చేనేత కార్మికులు పడుతున్న బాధలను అడిగి తెలుసుకున్నారు. ఎన్డీయే పాలనలో చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర లేక చివరకు చేనేత వ్యవస్థ అంతరించిపోయే ప్రమాదం వుందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో బిజెపికి ఓటుతో బుద్ధి చెప్పి, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేద్దామన్నారు. ఆయనతో పాటు పలువురు చేనేత కార్మికులు, కాంగ్రెసు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## ఆటోలకు ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్య



**నింద్ర,జూన్ 5 ప్రభాతవార్త :** ఆటోలో ప్రయాణీకుల భద్రత,నేరాల నియంత్రణ,ట్రాఫిక్ నిర్వహణ,ప్రజలకు మరింత నమ్మకమైన రవాణాసేవలు అందించడమే లక్ష్యంగా ఎస్పీ తుషార్‌డూడి జన విశ్వాస్ సురక్షత త్రిచక్ర వాహన ప్రయాణాలు కార్యక్రమంను ఆదేశాల మేరకు మండలంలోని పోలీసులు ఆటో,రిక్షాలకు ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో కూడిన పోలీసు గుర్తింపు సంఖ్యలను అందజేసారు. నింద్ర యస్ఐ మల్లీఖార్జున్ ఆధ్వర్యంలో ప్రజలతో మరింత సన్నిహిత సంబందాలను పెంపొందిస్తూ సాంకేతక పరిజ్ఞానంను వినియోగించి ప్రజల్లో భద్రత భావం, పోలీసుశాఖాపై మరింత విశ్వాసంను మరింత బలోపేతం చేసే దిశగా ముందడుగు వేస్తూ ఆటోలకు పోలీసు గుర్తింపు సంఖ్యను అందజేసారు. తద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో,డ్రైవర్ యాజమాని వాహనానికి సంబందించి అధికారిక వివరాలు ఇతర అవసమైన సమాచారం అధికారులకు తక్షణం అందుబాటులో వుంటుందన్నారు.ఈకార్యక్రమంలో మండల పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారానికి పరిష్కార వేదిక



**వడమాలపేట, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార వేదికకార్యక్రమం నిర్వహిస్తున్నదని వడమాలపేట ఎంపీడీవో శేషగిరిరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పూడి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఖాన్ బాషా, ఏఈపీఆర్ నాగేంద్ర, డీటీ కృష్ణమ్మ, ఆర్ఐ జానిబాషా, వీఆర్‌వో భూపతి, ఏపీవో హంసవేణి, ఏపీఎం మురళీకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాంజలి, హౌసింగ్ మండల ఇన్‌చార్జి రూపేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ఆరోగ్యానికి బాట



**తిరుపతిరూరల్,జూన్ 5 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ సచివాలయంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. తిరుచానూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ ఊరిబిండి మౌనిక మునిశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరుచానూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటిస్తే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రవికుమార్, నాయకులు బాబు రాయల్, ప్రహ్లాదరెడ్డి, సుధాకర్, మునిరెడ్డి, శ్రీనురాయల్, శంకర్, సునీల్‌రాయల్, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆయుధం



**తిరుపతిరూరల్,జూన్ 5 ప్రభాతవార్త:** భవిష్యత్ తరాలకు పచ్చని భూమిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "మన భూమి – మన బాధ్యత" అనే నినాదంతో శుక్రవారం పద్మావతిపురం జడ్పిటిసి స్కూల్లో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ సురేష్, ఎంపిడిఓ మస్తాన్ వల్లి, డిప్యూటీ ఎంపిడిఓ దయాసాగర్, పంచాయతీ కార్యదర్శి మాధవి, ఏపిఓ జ్యోతిశ్రీ, హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** ఏఎన్డి ఎ కూటమి ప్రభుత్వం పేదలకు కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన నగరంలోని న్యూ బాలాజీ కాలనీ, ఎం.ఆర్.పల్లి ప్రాంతాల్లోని అన్నా క్యాంటీన్లను తనిఖీ చేశారు.న్యూ బాలాజీ కాలనీలోని అన్నా క్యాంటీన్‌లో ఎమ్మెల్యే స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. భోజనం నాణ్యంగా ఉందని సిబ్బందిని అభినందించారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడి ఆహారంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది



**తిరుపతి, జూన్ 5(ప్రభాతవార్త)ప్రతినిధి:** పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ ప్రజా సేవలో నిమగ్నమై ఉంటారని, విధి నిర్వహణలో బిజీగా ఉండటం వల్ల చాలామంది తమ ఆరోగ్యాన్ని నిరక్ష్యం చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ అత్యంత విలువైన సంపద అని, ముఖ్యంగా ఎక్కువ సమయం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరమని ఎస్పీ తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరేడ్ మైదానంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ మరియు విధి నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే సమాజానికి ఉత్తమ సేవలు అందించగలరని ఎస్పీ సూచించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది యోగా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్య సూత్రాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట రావు, రవి మనోహరాచారి, శ్రీనివాసులు, డీఎస్పీలు, సిబ్బంది, హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి...పర్యావరణం కాపాడుకోవాలి



**చిత్తూరు(పాలసముద్రం), జూన్ 5(ప్రభాతవార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పాలసముద్రం మండలం వనదుర్గపురం పంచాయతీ యానాది కాలనీ, ఆదిఆంధ్రవాడలో రూరల్ యాక్షన్ సంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం వనదుర్గాపురంలో రెండు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో రూరల్ యాక్షన్ సంస్థ కార్యదర్శి పి. చిట్టిబాబు పాల్గొన్నారు. రూరల్ యాక్షన్ సంస్థ ,అమ్మాక్స్ సౌజన్యంతో నిర్వహించారు. చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాము మహిళవిభాగం షాలిని, భూమిహితులు భారతి, జయంతి, వెంకటేషులు, రాజేశ్వరి, రుక్మిణి, రాజ్యలక్ష్మి, కనక, ఉమ, రుక్మిణి, గ్రామస్తులు శేఖరరాజు, వరదరాజులు, పర్యావరణ ప్రేమికులు సుబ్రహ్మణ్యం యాదవ్‌ను సత్కరించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

– బీజేపీ నేత గుండాల గోపినాథ్ రెడ్డి



**తిరుపతి, జూన్ 5(ప్రభాతవార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి నేత లోక ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ పార్క్ కూడలిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ నేత గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సంకల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, రామ్ కుమార్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండె చెంగారెడ్డి, టిడిపి నాయకులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**తిరుపతి, జూన్ 5(ప్రభాతవార్త):** దేశ ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్పీడీసీఎల్ టెన్నిస్ కోర్టు లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీ స్టేట్ జనశక్తి విద్యుత్ ఎంప్లాయూస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సంధర్బంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోకల అశోక్ కుమార్ మాట్లాడు తూ డిసిఎం కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క నాటి ప్రకృతి ప్రసాదించిన పర్యావరణాన్ని పరిరక్షించి ఆరోగ్యమైన జీవితాన్ని పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో యూనియన్ సభ్యులు పి.జి.రాజు, టెన్నిస్ చీఫ్ కోచ్, యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇరివిశెట్టివెంకటాద్రి, ఆకుల దిలీప్ టెన్నిస్ వర్ధమాన క్రీడాకారులు , క్రీడాకారిణులు పాల్గొన్నారు.

## శ్రీవారి వైద్య సేవకు...



**తిరుమల, జూన్ 5(ప్రభాతవార్త)ప్రతినిధి:** టిటిడి ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు శ్రీవారివైద్యసేవ అమలుచేస్తున్నారు. ఈ సేవల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడి ఆసుపత్రుల్లో శ్రీవారి వైద్య సేవ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శుక్రవారం మొదలైంది. రూపొందించిన ఐటీ అప్లికేషన్‌ను ఈఓ ప్రారంభించారు. ప్రయోగాత్మక దశలో కార్యక్రమాన్ని అమలు చేసి, పాల్గొనే వైద్య నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించి మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఈఓ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. టిటిడి ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో సేవలందించేందుకు వచ్చే నిపుణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, జెఈఓలు(విద్య, వైద్యం) డాక్టర్ శరత్, వీరబ్రహ్మం, బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ,సివిఎస్ఓ మురళీకృష్ణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు



తిరుపతి రవాణ, జూన్ 5 ప్రభాతవార్త: విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తిరుపతి నగర పరిధిలోని విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో ఆరు బృందాలుగా ఏర్పడిన మోటార్ వాహన తనిఖీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 850 విద్యాసంస్థల బస్సులను పరిశీలించగా, సాంకేతిక లోపాలు గుర్తించిన 75 వాహనాలకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మరమ్మత్తులు చేపట్టి తిరిగి తనిఖీలకు సమర్పించాలని సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు. మోటారు వాహనాల చట్టంలోని నిబంధనల ప్రకారం పాఠశాల, కళాశాల బస్సులకు వర్తించే భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని బస్సులు మరమ్మత్తులు పూర్తి చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పునరుద్ధరించుకున్న తర్వాతే రోడ్లపై నడపాలని జిల్లా రవాణా శాఖ అధికారి స్పష్టం చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలతో పాటు తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.

## మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

–రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పొలిట్‌బ్యూరో సభ్యులు



**శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త:** మాజీ శాసనసమండలి చైర్మెన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పోలీట బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్ శుక్రవారం శ్రీకాళహస్తిలో విస్తృతంగా పర్యటించారు. పలు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు మైనారిటీల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాబమియా మస్జిద్‌లో శుక్రవారం ప్రార్థనల్లో పాల్గొన్నారు. తరువాత ఆయన ఇక్కడ మసీదు ముతవల్లి ఏర్పాటు చేసిన మైనారిటిల కార్యక్రమంలో పాల్గొన్నారు. మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అయితే మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మైనారిటిల సమస్యలకు సంబంధించి మసీదుముతవల్లి అక్రం సాహెబ్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఖాజీ మోహిద్దీన్ షరీఫ్(మున్నా)ల సారథ్యంలో వినతి పత్రాన్ని అందించారు. శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసనసభ్యులుగా ఉన్నపుడు షాదీ మహల్స్, అలాగే శ్మశానాలకు నిధులు కేటాయించారన్నారు. ఆయన పుణ్యామా అని నేడు శ్రీకాళహస్తిలోని అయ్యలనాడు చెరువు, ఈదుల గుంటల్లో ఈద్‌గాహ్‌లకు స్థలం కేటాయించారన్నారు. అలాగే రెండుషాదీమహల్స్‌ను నిర్మించారని తరువాత వచ్చిన వారు అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఈద్‌గాహ్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించారని అలాగే షాదీమహల్ అభివద్ధికిప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ మీ సమస్యలు ఏదీ అయినా స్థానిక శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి లెటర్ హెడ్‌పై పంపాలని అవి ఆమోదం పొందేటట్లు తాను చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్బంగా ఆయన మట్లాడుతూ మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నాయకుడు లోకేష్‌లు మైనారిటీలు ఏదీ కోరితే అది ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో మసీదు బాధ్యులు అక్రం సాహెబ్, నూరుల్లా సాహెబ్, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, జిలాని బాషా, షఫీ, కరీం, బషీర్, జహీర్, ఖాదర్, అస్మత్, మీర్జా, షాకీర్ అలి, ఖలీల్‌బాషా, రఫీ, కరీం, మీర్జా, సాజిత్, ముజీబ్, ఆరీఫ్, రసీద్, అల్లాబక్ష, షాజహాన్, చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా తెలుగుదేశం మైనారిటి నాయకులు మహమ్మద్‌షరీఫ్‌ను లోబావిలో సత్కరించారు.

## యూరియా బస్తాలు పంపిణీ



తొట్టంబేడు, జూన్ 5 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలో యూరియా బస్తాలను శుక్రవారం పంపిణీ చేయించిన, తెలుగుదేశం పార్టీ నాయకులు యూనిట్ ఇన్చార్జ్, చింతపట్ల భాస్కర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి, యూనిట్ కో కన్వీనర్ చెన్ను రాఘవులు యాదవ్ తెలిపారు. చెన్ను రాఘవుల యాదవ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండడంతో యూరియా బస్తాలను పంపిణీ చేయడం జరుగుతుందని మరికొన్ని రోజుల్లో మండలం మొత్తం 5000 వరకు యూరియా బస్తాలు రానున్నట్లు వారు తెలిపారు. బూత్ కన్వీనర్ బొర్రా దివ్య, కాసరం గ్రామం రైతులు, బి.అంకయ్య, ఏ ,భాస్కర్, సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కల్ని విరివిగా నాటాలి!



**శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని" కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో "మా నామ్ కే ఏక్ పెడ్" కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ కోలా ఆనంద్ కార్యకర్తలుతో కలసి భాస్కర్ పేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విరివిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ నేత కోలా ఆనంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తన అమ్మ పేరు మీద ఒక్క మొక్కను ఖచ్చితంగా నాటలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## గొట్టిపూడి గ్రామానికి దారి ఏర్పాటు



తొట్టంబేడు జూన్ 5 ప్రభాతవార్త : తొట్టంబేడు మండ్నల గొట్టిపూడి గ్రామంలో మేత భూములు వెళ్లే బాటలో స్థానిక శాసనసభ్యులు ఆదేశానుసారం, మండలపార్టి అధ్యక్షులు రావిళ్ల మునిరాజ నాయుడు సారథ్యంలో మండల తహసిల్దార్ భారతీ ఎంపీడీవో పి సురేంద్రనాథ్ మండల సర్వేయర్ హరి, ఏ జి పి కమల్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్‌మండల నాయకులు గ్రామస్తులు సమక్షంలో బాట సమస్యను పరిష్కరించడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ ముని రాజా నాయుడు అన్నారు . ఈ మార్గంలో పొలాలు ఉన్నందున 30 అడుగుల రోడ్డుకు పశువుల మేతకు అటవీ ప్రాంతంలో వెళ్లే విధంగా బాట సమస్య పరిష్కారమైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## వంద కుటుంబాలకు వంద మొక్కలు



**ఏర్పేడు, జూన్ 5 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వంద కుటుంబాలకు వంద చెట్లను పంపిణి చేసారు. తిరుపతికి చెందిన ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఇండియా సారథ్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలుకార్యక్రమాలను ఏర్పాటు చేసారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నివారణ, సహజవనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించుటకు కార్యక్రమాలను రూపొందించారు. ఈ కార్యక్రమాల్లో ఎ.వవెంకటరమణ, ఎస్ వెంకటలక్ష్మి,లు పాల్గొన్నారు. వారితో పాటు అసిస్టెంట్‌డైరెక్టర్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంగరాజుకు జాతీయ వాగ్దేవి పురస్కారం



శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త: చదువుల డాక్టర్, భాషా శాస్త్రవేత్త సంగరాజు భాస్కర్‌రాజును శుక్రవారం శ్రీకాళహస్తిలో ఘనసత్కారం నిర్వహించారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ సారథ్యంలో నిర్వహించిన ప్రత్యేక సాహిత్య భాషా సంస్కృతి కార్యక్రమాల్లో ఆయన్ను ఘనంగా సత్కరించారు. తెలుగు భాషాభివృద్ధి భాషా పరిశోధన, విద్యారంగాలలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ఆయనకు ఈ పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కారం అందుకున్న సంగరాజు భాస్కరరాజు మాట్లాడుతూ ఈ గౌరవానికి జాతీయ తెలుగు సారస్వత పరిషత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మైనారిటి వ్యవహారాల మాజీ శాసనసమండలి చైర్మెన్ షరీఫ్ మహమ్మద్‌షరీఫ్, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ తదితరులు పాల్గొన్ని సత్కరించారు. దుశ్శాలువతో మెమొంటో ధృవీకరణ పత్రాలను అందించారు.

## ప్రకృతి పరిరక్షణకు ముందుకు రావాలి



తొట్టంబేడు, జూన్ 5 ప్రభాతవార్త: నేడు సమాజంలో పర్యావరణానికి ముప్పు చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్బంగా తొట్టంబేడు గ్రామంలో చెట్టు నాటి ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేయాలని మన ఇల్లు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అందరిని చైతన్యపరచి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో మిన్నల్‌రవి, డాక్టర్‌యం.ఉమేష్‌రావు బీమాల భాస్కర్, వజ్రం కిషోర్ కోట చంద్రశేఖర్ గాజుల భగత్, గురుమూర్తి, ముని, చంద్రబాబు, సులేమాన్ వెంకటయ్య, సుబ్రమణ్యం, తేజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాగా ఇన్ హోటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**తిరుపతి విద్య, జూన్ 5 ప్రభాతవార్త:** పుణ్యక్షేత్రం తిరుపతిలో ఆధునిక వసతి సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన రాగా ఇన్ హోటల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని డీబీఆర్ హాస్పిటల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ హోటల్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం హోటల్‌లోని గదులు, రెస్టారెంట్, అతిథుల కోసం ఏర్పాటు చేసిన ఇతర సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు. హోటల్ నిర్వాహకులు పేరం వెంకటరమణ, పేరం రాధిక కిరణ్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, పర్యాటకులకు అందుబాటు ధరల్లో మెరుగైన వసతి, ఆతిథ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాగా ఇన్ హోటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో ఆతిథ్య రంగ అభివృద్ధికి రాగా ఇన్ హోటల్ మరో కొత్త చిరునామాగా నిలవనుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పుట్టినరోజున శ్రీవారి దర్శనం...తన జీవితం ధన్యం

–కేంద్రమంత్రి గోయల్



**తిరుమల, జూన్ 5(ప్రభాతవార్త)ప్రతినిధి:** ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో తన జన్మదినం సందర్బంగా తిరుమలను సందర్శించి శ్రీవారి ఆశీస్సులు పొందడంతో తన జీవితం ధన్యమని కేంద్ర వాణిజ్యప రిశ్రమలశాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలి పారు. శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. అనంతరం కొండపై మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఈఓముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, , ఆలయ పేష్కార్ రామకృష్ణ ఉన్నారు. అనంతరంతిరుమలలోనిఏఐఆధారిత ఐసిసిసిని సందర్శించి భక్తులకు అందిస్తున్న సేవలను గమనించారు.

## మనస్సును అదుపులో పెట్టుకోవాలి: రేహాన్



శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త: మనిషి మనస్సును అదుపులో పెట్టుకోవాలని కొర్కెలను జయించాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరు మార్పు కోరుకుంటున్నారని అది సన్మార్గం కావచ్చు, దుర్మార్గంలో కావచ్చునని భావిస్తున్నారని వివరించారు. అయితే సమాజంలో ముస్లింలు ఆచరించాల్సిన విధి విధానాలను దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొంటూ దానిని ఆచరించే విధానాలను మనకు వివరించటానికి ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని మార్గదర్శకంగా ఇచ్చారన్నారు. కానీ మనిషి తన ఉన్నతి కోసం ఇస్లాం మతం ఆదేశాలను తన సొంత అజెండాలతో నడచుకుంటూ కష్టాలు, కన్నీళ్ళు కొని తెచ్చుకుంటున్నారని ఈ విధానాల్లో మార్పు రావాలని రేహాన్ సూచించారు. భక్తితో తలవంచి చేతులు జోడించే వారి ప్రార్థనలను తప్పక ఆచరిస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రకృతి పరిరక్షణతో భావితరాలకు కాలుష్య నియంత్రణ



**చంద్రగిరి, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రకృతిని మనం పరిరక్షించడం ద్వారా భావితరాలకు కాలుష్యకోరల నుండి నియంత్రణ లభించగలదని టోల్ ప్లాజా మేనేజర్ సెంథిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు – మల్లవరం ప్రాజెక్ట్ "నేషనల్ హైవే ఇన్‌ఫ్రా ట్రస్ట్" సదరన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్" (ఎన్‌హెచ్‌ఐటి ఎన్ఎస్‌పిపిఎల్) ఆధ్వర్యంలో శుక్రవారం గాదంకి టోల్‌ప్లాజా వద్ద ఆయన మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలన్నారు. నావంతుగా ప్రతి ఏటా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ద్వారా పర్యావరణ రక్షణకు దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతను అలవరుచుకోండి : ఎంఎల్ఏ

**రామచంద్రాపురం, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుచుకుని ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. శుక్రవారం రాయలచెరువు కట్ట క్రింద వెలసియున్న శ్రీకామాక్షి సమేత కోటి లింగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద దాతల సహకారంతో అభివృద్ధి పరిచిన పనులను ఆయన ప్రారంభించారు. శ్రీజలకంఠేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో నూతనంగా నిర్మించిన దుకాణాల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన ఎంఎల్ఏకి ఆలయ నిర్వాహకులు తంజావూరు మణి, జయభారతి దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ చౌదరి, టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి లత సుబ్రమణ్యం రెడ్డి, టిడిపి నాయకులు ఆరి లీలామోహన్, జెడి జగన్, నీలకంఠ చౌదరి, కేశవులు నాయుడు, రావిళ్ళ గిరి, సురేంద్ర నాయుడు, కోటీశ్వర్ రెడ్డి, త్యాగరాజులు రాయల్, ఈశ్వర్ రాయల్, విజయ్‌కుమార్ రాయల్, సుగుణమ్మ, మహేష్ నాయుడు, దేశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్ను రాజకీయాలకు రెండేళ్ళు



**రామచంద్రాపురం, జూన్ 5 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెన్నుపోటు రాజకీయాలకు రెండేళ్ళు పూర్తయ్యాయని వైసిపి మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన మ్యానిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ళు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లకార్డులతో సింగిల్‌విండో కార్యాలయం నుండి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానంద రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి భానుకుమార్ రెడ్డి, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**సత్యవేడు, జూన్ 5 ప్రభాతవార్త:** శ్రీసిటీలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా సోలమ్ ఇండియా హైటెక్ ప్రైవేటు లిమిటెడ్ సమీపంలో విస్తృత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) సభ్యులు ఎన్.నాగేశ్వరరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)ప్రాంతీయడైరెక్టర్ హెచ్.డి.వరలక్ష్మితో పాటు సీపీసీబీ, ఏపీపీసీబీలకు చెందిన పలువురు అధికారులు, సత్యవేడు అటవీశాఖ రేంజ్ అధికారి త్రినాథరెడ్డి పాల్గొన్నారు. శ్రీసిటీహార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ విభాగం ఇన్‌చార్జి డి.ఎస్.రెడ్డి అతిథులను ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అతిథులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సుస్థిరాభివృద్ధి దిశగా కృషిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. బ్లూస్టార్, పానాసోనిక్, హెల్తియం మెడ్‌టెక్, కింబర్లీ క్లార్క్, సుంద్రం ఫాస్టెనర్స్, నాఫ్ తదితర సంస్థల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడంతోపాటు పలు హరిత కార్యక్రమాలు చేపట్టారు.

## వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరునికి కల్యాణం



**వడమాలపేట, జూన్ 5 ప్రభాతవార్త:** శ్రవణా నక్షత్ర శుభదినాన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి కల్యాణం అప్పలాయగుంట ఆలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం శ్రీవారు, ఉభయదేవేరుల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడికాయలు కోస్తూ...

–విద్యుత్ షాక్‌కు గురై చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి



**తవణంపల్లె, జూన్ 5 ప్రభాతవార్త:** మామిడికాయలు కోస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చెట్టుపై నుండి కిందపడి ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కట్టకిందపల్లె గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సంఘటనకు సంభందించి స్థానిక ఎస్సై జి.రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలావున్నాయి. కట్టకిందపల్లె గ్రామానికి చెందిన ఎస్.గుర్రప్ప(55), రమేష్ అనే వ్యక్తులు అదే గ్రామానికి చెందిన జయచంద్ర అనే రైతు మామిడితోటలో కాయలు కోసేందుకు కూలీ పని కోసం వెళ్ళారు. వారు ఉదయం చెట్టులో కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గుర్రప్ప, రమేష్‌లు చెట్టుపై నుండి కిందపడ్డారు. దీనితో గుర్రప్పకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అరగొండ అపోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అలాగే చెట్టుపై నుండి కిందపడిన మరో వ్యక్తి రమేష్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

## రూ.1,969 కోట్ల జీవనోపాదుల వార్షిక ప్రణాళిక

–ఈ ఏడాదిలో 18 వేల మందిని మహిళా పారిశ్రామికవేత్తలు తయారు

– జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి




**చిత్తూరు, జూన్ 5 ప్రభాతవార్త:** 2026–27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 12,792 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1,969.81 కోట్లతో జీవనోపాదుల ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాంకు లింకేజ్ వర్క్‌షాప్ జరిగింది. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ పిఎంఇజిపి పథకంలో 200 ఉమెన్ ఎంటర్‌ప్రైన్యూర్, పిఎంఎఫ్ఎంఇ ద్వారా వంద యూనిట్లు ఈ ఏడాది ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే ఈ ఏడాది జిల్లాలో 18 వేల మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే స్త్రీ నిధి ద్వారా రూ.635 కోట్ల సామాజిక పెట్టుబడి నిధి, సిఐఎఫ్ కింద రూ.40 కోట్లు, ఉన్నతి ద్వారా రూ.18 కోట్లు వార్షిక ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు బ్యాంకు మేనేజర్లు నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎంసిపిల ద్వారా అర్హత కల్గిన ప్రతి స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి పేర్కొన్నారు. అలాగే మన డబ్బులు మన లెక్కలు(ఎండిఎంఎల్) రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన స్వయం సహాయక సంఘాలకు సూపర్ ఈనారీ యాప్‌పై అవగాహన కల్పించిన పిడి ప్రతి సభ్యురాలు సూపర్ ఈనారీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, వారు పొందిన రుణ వివరాలు ఆ యాప్‌లో పొందుపరచి వుంటాయన్నారు. ఈ యాప్ ద్వారా ప్రతి మహిళా సంఘ సభ్యులకు బ్యాంకులో అప్పు ఎంత వుంది! ప్రతి నెల తాము ఎంత మొత్తం చెల్లించాల్సి వుంటుందనే విషయం తెలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం హరీష్, డిజిఎంలు, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.